బుధవారం
24-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 302
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తైవాన్‌లో 80 సార్లు భూప్రకంపనలు

తైపీ: తూర్పు ఆసియా దేశం తైవాన్‌ను వరుస భూకంపాలు కుదిపేస్తున్నాయి. సోమవారం అర్ధరాత్రి గంటల వ్యవధిలోనే 80 సార్లు భూమి కంపించగా.. జనాలు భయంతో రోడ్ల మీదకు పరుగులు తీసి బిక్కుబిక్కుమంటూ గడిపారు. భూకంపాల ధాటికి కొన్ని భవనాలు నేలమట్టం కాగా, ప్రాణ నష్టంపై వివరాలు అందాల్సి ఉంది. ఏప్రిల్ తొలివారంలో ఈ ద్వీపదేశం భారీ భూకంపం ధాటికి వణికిపోయిన సంగతి తెలిసిందే. తైవాన్ తూర్పు ప్రాంతమంతా సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువఝాము దాకా భూమి కంపించింది. భారీ ప్రకంపనల ధాటికి రాజధాని తైపీలో భవనాలు ఊగిపోయాయి.

విద్వేష ప్రసంగం చేసిన
మోదీపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల సంఘానికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా లేఖ

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తూ విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీపై తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈఓ) రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 21న రాజస్థాన్‌లోని బన్స్వారాలో బహిరంగసభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం అత్యంత అభ్యంతరకరమన్నారు. ఆయన వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని స్పష్టంగా ఉల్లంఘించాయి. ఆయన ముస్లింలను ఉద్దేశించి 'మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారికి ఇవ్వాలా?' అన్నారు. ప్రధాని ప్రసంగం అన్ని టీవీ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రసారం చేయబడింది. అనేక వార్తాపత్రికలు ముద్రించాయని తెలిపారు. ప్రధాని ప్రసంగంలోని ముఖ్యాంశాలను రాజా ప్రస్తావిస్తూ... ఆయన చేసిన వ్యాఖ్యలు చట్ట విరుద్ధమే కాక వివిధ వర్గాల ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, ఉద్రిక్తతల్ని ప్రేరేపించేలా ఉన్నాయని తెలిపారు. ఆయన హిందూ సమాజాన్ని, ముస్లిం సమాజాన్ని ప్రస్తావిస్తూ... ఉద్దేశపూర్వకంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని వివరించారు. ఏదైనా నిర్దిష్ట మతాన్ని, వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని సెక్షన్ 123 (3)ని పూర్తిగా ఉల్లంఘించినట్లు ఈసీఐ అంగీకరించాల్సి ఉంటుందని రాజా స్పష్టం చేశారు. కాబట్టి ప్రధాని మోదీపై తక్షణమే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తిచేశారు.

ట్రంప్ ఎన్నికల మోసానికి పాల్పడ్డారు? -2లో

మోదీతో రాజ్యాంగానికి ముప్పు

బీజేపీకి వైసీపీ, టీడీపీ, జనసేన మద్దతు సిగ్గుచేటు

రాష్ట్రానికి బీజేపీ అడుగడుగునా మోసం

జంగాల నామినేషన్ కార్యక్రమంలో నారాయణ



విశాలాంధ్ర-గుంటూరు: మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీకి వైసీపీ, టీడీపీ, జనసేన వంతపాడటం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో తన నామినేషన్ దాఖలు చేశారు. తొలుత శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగానికి, సెక్యులరిజానికీ ప్రమాదం ఏర్పడిందని హెచ్చరించారు. మోదీ ఎలాగైనా తిరిగి ప్రధాని కావాలని చూస్తున్నారని, ఏకసూత్ర ప్రణాళిక అమలుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలు దేశం కోసం అనేక త్యాగాలు చేశాయని, బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం సాగించి విజయం సాధించాయని గుర్తుచేశారు. కానీ దేశం కోసం బీజేపీ ఏమి చేసిందని నారాయణ ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి అనుకూలంగా పనిచేశాయని, దేశం కోసం త్యాగాలు చేసిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో ఏడాదికి రూ.45 వేల కోట్లు కోల్పోవడానికి ప్రధాన ముద్దాయిలు ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డి అని చెప్పారు. మోదీతో చంద్రబాబు అధికారిక పొత్తు పెట్టుకుంటే... జగన్ అనధికార పొత్తు కొనసాగిస్తున్నారని, వారిలో ఎవరికి ఓటు వేసినా అది మోదీకి వేసినట్లేనని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమిని గెలిపించాలని ప్రజలను ఆయన

- మిగతా 2 లో

భారీ ర్యాలీతో జాఫర్ నామినేషన్

బీజేపీకి వైసీపీ, టీడీపీ, జనసేన దాసోహం: రామకృష్ణ

6లో

అట్టహాసంగా బండి నామినేషన్

ప్రజాస్వామ్య రక్షణకు ఇండియా గెలుపు అవశ్యం

జల్లి విల్సన్, అక్కినేని వనజ

6లో

అసమర్థ ముఖ్యమంత్రి జగన్

▸ విధ్వంసమే వైసీపీ అజెండా ▸ చంద్రబాబు విమర్శలు

విశాలాంధ్ర-పాతపట్నం (శ్రీకాకుళం): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని...అసమర్థ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలుస్తారని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. పాతపట్నం, ఆమదాలవలసలో మంగళవారం ప్రజాగళం బహిరంగ సభలు నిర్వహించారు. పాతపట్నం సభలో చంద్రబాబు

- మిగతా 2 లో

నిరంతర నిఘా

▸ ట్రిపుల్ సీతో అక్రమాలపై జల్లెడ

▸ వెబ్ కాస్టింగ్ ద్వారా చెక్‌పోస్టుల్లో పర్యవేక్షణ

▸ సీఈఓ ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు తావులేకుండా ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ట్రిపుల్ సీ) ద్వారా రాష్ట్రాన్ని జల్లెడపడుతోంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయంలో ఆధునిక సాంకేతికత అనుసంధానంతో దీనిని ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎంసీసీ ఉల్లంఘనలు, మద్యం అక్రమ రవాణా, సీజర్లపై పటిష్టమైన పర్యవేక్షణ, నియంత్రణపై నిఘా పెడతారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న

424 చెక్ పోస్టుల్లో దాదాపు 358 చెక్ పోస్టుల (84.4 శాతం) నుంచి వెళ్లే వాహనాల కదలికలను వెబ్ కాస్టింగ్ ద్వారా ఈ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక మొత్తంలో రూ.141 కోట్ల విలువకు పైబడి నగదు, లిక్కర్, డ్రగ్స్, ప్రెషస్‌మెటల్స్, ఫ్రీ బీస్, ఇతర వస్తువులను జప్తు చేశారు. ఓటర్లపై మద్యం ప్రభావం

- మిగతా 2 లో

2లో

డ్రీమ్ మీది... స్కీమ్ నాది

చంద్రబాబుది చంద్రముఖి పాలన: సీఎం జగన్

డ్రీమ్ మీది... స్కీమ్ నాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల కలలను సాకారం చేశానని, పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చానని తెలిపారు. మంగళవారం విజయనగరం నియోజకవర్గం చెల్లూరులో 'మేమంతా సిద్ధం' సభ జరిగింది.

రేపు పులివెందులలో జగన్ నామినేషన్ 2లో

7 వరకు కేజ్రీవాల్, కవిత జైలులోనే...

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు, బీఆర్ఎస్ నాయకురాలు కవితకు మే 7వ తేదీ వరకు ఢిల్లీ కోర్టు మంగళవారం జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. ఈ కేసులో ఇద్దరికీ మరో 14 రోజుల పాటు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మే 7న ఈ నేతలిద్దరినీ కోర్టు ఎదుట హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు. రిమాండ్ గడువు ముగియడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారిని కోర్టు ముందు హాజరుపరచగా సీబీఐ, ఈడీ వ్యవహారాల ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా కస్టడీని పొడిగించారు. ఈడీ సమన్లకు వ్యతిరేకంగా అరవింద్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సార్.. 'మానిఫెస్టో' పై కసరత్తు ఎందుకు? ఎలాగూ 'మనీఫెస్టివలు' చేస్తాం కదా

ఇద్దరు ఐపీఎస్‌లపై ఈసీ వేటు

ఎన్నికలకు సంబంధం లేని విధులకు బదిలీ

విశాలాంధ్ర-విజయవాడ: మరో ఇద్దరు ఐపీఎస్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం వేటు వేసింది. ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ పోలీసు కమిషనర్ కాంతా రాణా టాటాలను ఈసీ బదిలీ చేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత విపక్షాల ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ ఇప్పటికే చాలామంది ఐపీఎస్, ఐఏఎస్‌లను ఎన్నికల విధుల నుంచి తప్పించింది. ఆ ఇద్దరు అధికారులను తప్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఇద్దరు అధికారులకు ఎన్నికలతో సంబంధం లేని విధులు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని సూచించింది. ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా విజయవాడలో సీఎంపై గుర్తు తెలియని వ్యక్తులు గులకరాయితో దాడి చేయటంలో రాజకీయ దుమారం రేగింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం ఈసీకి ఫిర్యాదు చేసుకున్నాయి. అంతేకాకుండా ఐపీఎస్ అధికారుల సంఘం తరఫున ఆ సంఘం అగ్రనాయకులకు తెలియకుండా కాంతిరాణా టాటా లేఖ విడుదల చేయటం వివాదాలకు దారి తీసింది.

ప్రముఖుల పర్యటనల సందర్భంగా చోటుచేసుకున్న దుశ్చర్యల కారణంగా ఇంటెలిజెన్స్ డీజీపైనా వివాదాలు వచ్చాయి. గులకరాయి ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరు ఆ శాఖ ప్రతిష్ఠను దెబ్బతీసింది. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో అరాచక సంఘటనలు, అల్లర్లు, రాజకీయ హత్యలు జరుగుతున్నాయని ఈసీ అసహనం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయనే దానిపై నివేదిక కోరింది. నివేదికను పరిశీలించిన తరువాత కేంద్ర ఎన్నికల సంఘం ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

రెండు హెలికాప్టర్లు ఢీ: 10 మంది దుర్మరణం

కౌలాలంపూర్: మలేసియాలో నౌకదళం విన్యాసాలు చేస్తున్న వేళ అపశృతి చోటుచేసుకుంది. రెండు హెలికాప్టర్లు గగనతలంలో ఢీకొన్న ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. నావికాదళం విన్యాసాలు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. మలేసియాలో ఏప్రిల్ 26న రాయల్ మలేసియన్ నేవీ దినోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా పెరక్‌లోని లుమత్ ప్రాంతంలో రిహార్సల్స్ నిర్వహించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం విన్యాసాల కోసం గాల్లోకి ఎగిరిన రెండు హెలికాప్టర్లు కొద్ది క్షణాలకే ప్రమాదవశాత్తూ ఢీకొని కుప్పకూలాయి. వీటిల్లో ఒకటి విన్యాసాలు జరుగుతున్న ప్రాంతానికి పక్కనే ఉన్న స్థానిక స్టేడియంలో కూలిపోగా మరొకటి స్విమ్మింగ్‌పూల్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో రెండు హెలికాప్టర్లలో ఉన్న 10 మంది సిబ్బంది దుర్మరణం చెందారు. వీరిలో ఇద్దరు లెఫ్టినెంట్ కమాండర్లు ఉన్నారు. హెలికాప్టర్లు కూలుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అయితే ఈ ఘటనపై దర్యాప్తును ప్రారంభిస్తామని మలేసియా నౌకదళం పేర్కొంది. ఏడబ్ల్యూ 139 మారిటైమ్ ఆపరేషన్ హెలికాప్టర్‌లో ఏడుగురు సిబ్బంది ఉన్నారు. దీనిని ఇటాలియన్ డిఫెన్స్ కాంట్రాక్టర్ లియోనార్డో అనుబంధ సంస్థ అగస్టా వెస్ట్ ల్యాండ్ తయారు చేసింది. మరొకటి యూరోపియన్ మల్టినేషన్ డిఫెన్స్ ఎయిర్ బస్ తయారు చేసిన తేలికపాటి విమానం ఫెన్నెక్ లో మరో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. రెండు హెలికాప్టర్లలో ఉన్న సిబ్బంది మొత్తం మరణించారు. సిబ్బందిని గుర్తించేందుకు వారి అవశేషాలను ఆస్పత్రికి తరలించినట్లు నౌకదళం తెలిపింది. ఇటీవల జపాన్‌లో కూడా ఇదే తరహా ఘటన చోటుచేసుకున్న సంగతి విదితమే. గత శనివారం అర్ధరాత్రి ప్రత్యేక శిక్షణ నిమిత్తం వెళ్లిన రెండు నౌకాదళ హెలికాప్టర్‌లు ఢీకొని సముద్రంలో కుప్పకూలగా...ఆ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో ఏడుగురు గల్లంతయ్యారు. వారి ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదు.

ట్రంప్ ఎన్నికల మోసానికి పాల్పడ్డారు?

కోర్టులో వాడివేడి వాదనలు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ తరపున మరోసారి అధ్యక్ష ఎన్నికల బరిలో నిలవనున్న డొనాల్డ్ ట్రంప్ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గతంలో తన రాసలీలల బయటకు పొక్కకుండా ఉండేందుకు ఆయన ఓ మాజీ శృంగార తారకు డబ్బు ఇచ్చి అనైతిక ఒప్పందానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ వ్యవహారంతో ఆయన అధ్యక్ష ఎన్నికల్లో ఏకంగా మోసానికి పాల్పడ్డారంటూ ప్రాసిక్యూషన్ బలంగా వాదిస్తోంది. 2016 ఎన్నికల ప్రచారం సమయంలో... స్టార్మీ డేనియల్స్‌కు డబ్బులు ఇచ్చి ఆమెతో శారీరక సంబంధాన్ని బయటకు రాకుండా అనైతిక ఒప్పందం చేసుకున్నాడనే ఆరోపణలు ట్రంప్‌పై ఉన్నాయి. ఈ తరుణంలో.. ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలంటూ రెండేళ్ల తర్వాత ఆ పోర్న్‌స్టార్ కోర్టును ఆశ్రయించింది. అటుపై ఆయన అధ్యక్ష పదవిలో ఉండడంతో అత్యంత ప్రాధాన్యత గల కేసుగా దర్యాప్తు సంస్థలు విచారణ జరిపాయి. చివరికి.. న్యూయార్క్ గ్రాండ్ జ్యూరీ డొనాల్డ్ ట్రంప్ పై నేరారోపణలు చేసింది. తద్వారా అమెరికాలోనే తొలిసారిగా ఇలా నేరారోపణలు ఎదుర్కొన్న మాజీ అధ్యక్షుడిగా ట్రంప్ పేరు చరిత్రకెక్కింది. అయితే తొలిరోజు విచారణ సందర్భంగా.. న్యూయార్క్ కోర్టులో రెండు పక్షాల మధ్య వాదనలు జరిగాయి. ప్రాసిక్యూటర్ మాథ్యూ కోలాంగెలో మాట్లాడుతూ... "2016 ఎన్నికల సమయంలో డొనాల్డ్ ట్రంప్ మోసానికి పాల్పడ్డారు. తన పరువు పోకుండా ఉండేందుకు శతవిధాల యత్నించారు. ఇందుకోసం సెలి స్కాండల్‌ను కప్పి పుచ్చేలా వ్యవహరించారు. ట్రంప్ టవర్ ఇందుకు వేదిక అయింది. ఇది దీర్ఘకాలికంగా, ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర. తన గురించి చెడుగా మాట్లాడకుండా కొందరి నోళ్లు మూయించడానికి ఆయన డబ్బు ఖర్చు చేశారు. చట్టవిరుద్ధంగా జరిగిన ఆ ఖర్చు ఎన్నికలను ప్రభావితం చేసే అంశమే. కచ్చితంగా ఇది ఎన్నికల మోసం కిందకే వస్తుంది" అన్నారు. అయితే ట్రంప్ తరపు న్యాయవాది టాడ్ బ్లాంచె మాత్రం ఆ అభియోగాలను ఖండించారు. ట్రంప్ అమాయకుడని, ఎలాంటి నేరం చేయలేదని, అసలు మాన్‌హట్టన్ అటార్నీ ఆఫీస్ ఈ కేసును ఏనాడూ ప్రస్తావించలేదని వాదించారు. ఇక ఈ కేసులో ఇంకా వాదనలు కొనసాగాల్సి ఉంది.

మోదీతో రాజ్యాంగానికి ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. ప్రజాస్వామ్యవాది జంగాల అజయ్‌కుమార్ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఆయనకు కాంగ్రెస్, సీపీఎం మద్దతుగా నిలిచి... ఆయన గెలుపునకు కృషి చేయడం హర్షణీయమన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ మత ప్రాతిపదికన దేశాన్ని నిలువునా చీల్చడానికి మోదీ కుట్రపన్నారని విమర్శించారు. ముస్లింలకు వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగా హిందువులను రెచ్చగొట్టి ఈ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. మోదీ నాగరిక సమాజంలో ఉండాల్సిన వ్యక్తి కాదంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. మోదీ ప్రమాదకర వ్యాఖ్యలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్, జగన్‌మోహన్‌రెడ్డి కనీసం స్పందించకపోవడం దారుణమని నిందించారు. మోదీ వ్యాఖ్యలను వారు బలపరుస్తారా... వ్యతిరేకిస్తారా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని రైతులను చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి నిలువునా ముంచారన్నారు. ఒకరు అరచేతిలో వైకుంఠం చూపి త్రీడి వేస్తే, మరొకరు రాజధాని భూములకు విలువ లేకుండా చేశారని విమర్శించారు. రాజధానితో పాటు రాష్ట్రాన్ని ముంచే ఇటువంటి వారికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. గుంటూరు జిల్లాలో ఎంపీగా పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థిని, మంగళగిరిలో సీపీఎం అభ్యర్థిని, మిగిలిన ప్రాంతాలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో నూతన ప్రత్యామ్నాయ రాజకీయాన్ని ప్రోత్సహించాలని ప్రజలను ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనాలోచిత విధానాలతో దేశాన్ని పేదరికంలోకి నెడుతున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని చెప్పారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు ప్రజల భవిష్యత్తుకు కీలకమైనవని వ్యాఖ్యానించారు. దగాకోరు, అవకాశవాది అయిన మోదీ దేశంలో మూడవసారి అధికారం చేపట్టాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచిన మోదీకి ఓటు అడిగే హక్కు లేదన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీని సైతం మోదీ విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటకు గిట్టుబాటు ధరలు లేక...పెట్టుబడి చేతికి రాక రైతు అల్లాడిపోతున్నాడని, వ్యవసాయ రంగం అతలాకుతలమైందన్నారు. అయినా మోదీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో మోదీ మద్దతు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు.

గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు అసాధారణమైనవన్నారు. రెండు సిద్ధాంతాల మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. మతోన్మాదుల రాజ్యాంగం అమలు చేయడానికిగాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తొలగించాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ఆ దిశగా అడుగులు వేస్తారని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఇండియా కూటమి గెలిస్తే అంబేద్కర్ రాజ్యాంగం అమలులో ఉంటుందని చెప్పారు. ముస్లింలకు, క్రైస్తవులకు, పేదలకు అండగా కూటమి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినీకాంత్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.రవీంద్రనాథ్, ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చల్లా చిన ఆంజనేయులు, వెంకటసుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, నాయకులు పిచ్చయ్య, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉచితాలు సరికాదు

ఒకసారి చెబితే అమలు చేయాల్సిందే

ఫిరాయింపు నిరోధక చట్టం పటిష్టత అవశ్యం: వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ: ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పటిష్టం చేయాలని, ఎన్నికలలో ఉచితాలకు ముగింపు పలకాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... వెంకయ్య నాయుడుకు పద్మవిభూషణ్ అవార్డు ప్రదానం చేసిన అనంతరం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడారు. రాజకీయ నేతలు తరచూ పార్టీలు మారడం కలవరపరుస్తోందని, ఈ ధోరణి ఎంతమాత్రం మంచిది కాదని, అందుకే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పటిష్టం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇష్టానుసారం ఉచితాలు ప్రకటించడం ఏమాత్రం మంచిది కాదని, ఒకవేళ ఎన్నికల ప్రణాళికలో ప్రకటిస్తే ఆ హామీలు అమలు చేసి తీరాల్సిందేనని, మాటతప్పి...ప్రజలను మోసం చేయడం సరికాదని వెంకయ్య రాజకీయ పార్టీలకు హితవు పలికారు. కేవలం అధికారం కోసం ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పిస్తున్న రాజకీయ నాయకులను ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. 'ఇప్పుడు ఆందోళన ఏమిటంటే, ప్రజాజీవితంలో ప్రమాణాలు పతనం కావడం... రాజకీయ నాయకులు తరచూ పార్టీలు మారడం... కొత్త ధోరణి ఏమిటంటే ఉదయం ఒక పార్టీలో ఉండి సాయంత్రం మరో పార్టీలో చేరడం. ఆ తర్వాత మీ నాయకుడిని విమర్శిస్తారు. వీరిలో కొందరికి టికెట్లు కూడా దక్కాయి' అని అన్నారు. 'ఇది చాలా ఆందోళనకరమైన ధోరణి. ప్రజలు దీనిని నివారించాలి. ప్రజలు పార్టీలలో పని చేసి, వారి విశ్వసనీయతను నిరూపించుకోవాలి. ఎవరైనా పార్టీలు మారాలనుకుంటే, ఆ పార్టీ ఇచ్చిన పదవికి రాజీనామా చేసి, ఆ తర్వాత మాత్రమే మరొక పార్టీలో చేరాలి. ఆరోపణలు చేయడం అర్థం చేసుకోవచ్చు కానీ జరుగుతున్నది నిందించడం కాదు దుర్వినియోగం' అని అన్నారు. డబ్బులు లేవని, డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయో ఆలోచించకుండా ఎడాపెడా వాగ్దానాలు చేయడం మరో అనారోగ్యకరమైన ధోరణి అని అన్నారు. 'రాజకీయ పార్టీలు తప్పనిసరిగా మేనిఫెస్టోతో బయటకు రావాలి. రెండవది, రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే పథకాలతో ముందుకు రావాలి. మూడవది, వారు వనరులను ఎలా సమీకరించబోతున్నారు. వారు ఏమి ఖర్చు చేయాలనుకుంటున్నారో చెప్పాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి అన్నారు. 'చెట్టు నుంచి డబ్బు రాదు' అని అన్నింటినీ ఉచితంగా ఇవ్వడం ఎలా సాధ్యమని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా కొందరు నాయకులు, పార్టీలు ఎడాపెడా వాగ్దానాలు చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాలపై లక్షల కోట్ల రూపాయల ఆర్థిక భారం ఉన్నప్పటికీ నాయకులు వాగ్దానాలు చేస్తున్నారని, అన్నీ ఉచితంగానే ఇస్తున్నారని నాయుడు అన్నారు. 'నేను ఉచితాలకు వ్యతిరేకం. నేను రెండు విషయాలకు అనుకూలంగా ఉన్నాను. విద్య, ఆరోగ్యం ఉచితంగా ఇవ్వాలి. మీరు మిగతావాటిని నివారించవచ్చు. అయితే వారు అలా చేయడం లేదు' అని విమర్శించారు. 'ఇలాంటి వాగ్దానాలు, ఉచితాలను నిరుత్సాహపరచాలి. మీరు వనరులను ఎలా సమీకరించబోతున్నారని రాజకీయ పార్టీలు ప్రశ్నించాలి. మేనిఫెస్టో, వనరుల సమీకరణ, రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యాన్ని ప్రజలకు అందించాలి' అని ఆయన అన్నారు.

డ్రీమ్ మీది... స్కీమ్ నాది

విశాలాంధ్ర విజయనగరం : డ్రీమ్ మీది... స్కీమ్ నాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల కలలను సాకారం చేశానని, పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చానని తెలిపారు. మంగళవారం విజయనగరం నియోజకవర్గం చెల్లూరులో 'మేమంతా సిద్ధం' సభ జరిగింది. విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అధ్యక్షతన జరిగిన సభలో జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు ప్రతి ఇంటి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. చంద్రబాబుకు కాంగ్రెస్, బీజేపీ, దత్తపుత్రుడు, పత్రికలు ఉన్నాయని, వీటితో పాటు కుట్రలు, కుతంత్రాలు కూడా ఉన్నాయని చెప్పారు. జగన్ ఇంటింటికీ మంచి చేయకపోతే ఇంతమంది తోడేళ్ల అవసరం ఎందుకని ప్రశ్నించారు. ప్రతి వర్గానికి తాను మంచి చేస్తే, చంద్రబాబు వర్గం మాత్రం మోసం చేసిందన్నారు. మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేసిన వారిని 420 అనే అంటారని, వారిని చంద్రముఖి బృందమనీ కూడా అందామన్నారు. 130 సార్లు సంక్షేమ పథకాల బటన్ నొక్కి 2 లక్షల 70 వేల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారులకు అందించామన్నారు. ఇళ్ల స్థలాలు వంటి పథకాల కింద మరో లక్ష కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూర్చామని ఆయన వివరించారు. పథకాలలో సింహభాగం మహిళలకేనని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఎందుకు అభివృద్ధి జరగలేదనేది అందరూ ఆలోచించాలన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా అవ్వా తాతలకు రూ.3 వేల పెన్షన్ పథకం తెచ్చింది మీ బిడ్డేనని తెలిపారు. చదువుకున్న యువతకు దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా 2 లక్షల 31 వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. పంటలకు 9 గంటల ఉచిత విద్యుత్, ఇన్‌పుట్ సబ్సిడీ అందించామన్నారు. చంద్రబాబుని నమ్మాలా వద్దా ఆలోచించాలని, గతంలో కూడా ఇవే పార్టీలతో కూటమిగా వచ్చారని సీఎం జగన్ చెప్పారు. ఈ సందర్భంగా ఎన్నికలలో పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న కోలగట్ల, శంబంగి చినఅప్పలనాయుడు, బడ్డుకొండ అప్పలనాయుడు, తలే రాజేష్, బొత్స అప్పలనర్సయ్య, కిరణ్, బొత్స సత్యనారాయణను పరిచయం చేసి గెలిపించాలని కోరారు.

7 వరకు కేజ్రీవాల్, కవిత జైలులోనే...

(మొదటిపేజీ తరువాయి)

కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను మే 15న ఢిల్లీ హైకోర్టు విచారించనుంది. సీబీఐ విచారిస్తున్న సంబంధిత అవినీతి కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కుమార్తె కవితకు జ్యుడీషియల్ కస్టడీని మే 7 వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. 2021-22 నాటి ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకలు జరిగాయంటూ గత నెలలో ఈడీ అధికారులు కవిత, కేజ్రీవాల్‌ను వేర్వేరు తేదీల్లో అరెస్టు చేశారు. ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత వీరిద్దరూ తీహార్ జైలులోనే ఉంటున్నారు. మరోవైపు, ఇటీవల సీబీఐ కవితను తన కస్టడీకి తీసుకొని విచారించింది. ఇదిలాఉండగా, కవిత బెయిల్ పిటిషన్‌పైనా ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టింది. ఈడీ తరఫున జోయబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కవితకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. కవిత అరెస్టు చట్టబద్ధంగానే జరిగిందని, సెక్షన్ 19కి అనుగుణంగా జరిగినట్లు ఈడీ తరఫు న్యాయవాది వివరించారు. కాగా 'కవితను అరెస్టు చేయవద్దని సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఇవ్వలేదని, అరెస్టుకు గల కారణాలు చెప్పి కవిత సంతకం తీసుకున్నాం. అరెస్టు చేసిన 24గంటల్లో కోర్టులో హాజరుపరిచాం' అని ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై సుదీర్ఘ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. దీంతో తదుపరి విచారణను కోర్టు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. ఈడీ వాదనలు పూర్తయిన తర్వాత కవిత తరపు న్యాయవాదులు కౌంటర్ వాదనలు వినిపించనున్నారు.

కేజ్రీవాల్ షుగర్ స్థాయి పెరగడంతో ఇన్సులిన్... స్వాగతించిన ఆప్

అరవింద్ కేజ్రీవాల్ రక్తంలో చక్కెర స్థాయి పెరగడంతో ఇన్సులిన్‌ను 'తక్కువ మోతాదులో' అందించినట్లు న్యూఢిల్లీలోని తీహార్ జైలు అధికారులు మంగళవారం తెలిపారు. ఈ చర్యను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్వాగతించింది. తీహార్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం, ఎయిమ్స్ వైద్యుల సలహా మేరకు కేజ్రీవాల్‌కు సోమవారం సాయంత్రం రెండు యూనిట్ల తక్కువ మోతాదు ఇన్సులిన్ అందించారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ స్థాయి రీడింగ్ 217గా గుర్తించారు. దీనితర్వాత తీహార్‌లోని వైద్యులు ఆయనకు ఇన్సులిన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నారని అధికారి తెలిపారు. ఎయిమ్స్ నిపుణులు, ఏప్రిల్ 20న ముఖ్యమంత్రితో వీడియోకాన్ఫరెన్స్ సందర్భంగా షుగర్ స్థాయి ఒక స్థాయి దాటితే ఇన్సులిన్ ఇవ్వవచ్చని తీహార్ వైద్యులకు సూచించారని ఆయన వివరించారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ దాదాపు నెల రోజులుగా జైలులో ఉన్న సీఎం కేజ్రీవాల్‌కు ఇప్పుడు ఇన్సులిన్ అందించారని, ఆప్ జాతీయ కన్వీనర్ పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ గురించి ఆందోళన చెందారని, కానీ వారి పోరాటం ఫలించిందని సింగ్ అన్నారు. ఈ చర్యను ఢిల్లీ క్యాబినెట్ మంత్రి అతిషి స్వాగతిస్తూ, 'ఎక్స్' లో హిందీలో ఒక పోస్ట్‌లో, 'జై బజరంగ్ బలి! హనుమాన్ జయంతి సందర్భంగా శుభవార్త అందింది. తీహార్ ప్రభుత్వం ఎట్టకేలకు అరవింద్ కేజ్రీవాల్‌కి ఇన్సులిన్ ఇచ్చింది. ఇది హనుమాన్ జీ ఆశీర్వాదం. ఢిల్లీ ప్రజల పోరాట ఫలితం. ఈ పోరాట సమయంలో కూడా బజరంగ్ బలి ఆశీస్సులు మనందరిపై ఉంటాయి' అని పేర్కొన్నారు. కేజ్రీవాల్‌కు అధికారులు ఉద్దేశపూర్వకంగా ఇన్సులిన్ ఇవ్వడం లేదని ఆమె క్యాబినెట్ సహచరుడు సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. 'ముఖ్యమంత్రి చెప్పిన మాట నిజమే. ఆయనకు ఇన్సులిన్ అవసరమని ఈ రోజు స్పష్టమైంది. కానీ బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ఆధ్వర్యంలోని అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆయనతో సరిగా వ్యవహరించడం లేదు. బీజేపీ వాళ్లు చెప్పాలి! ఇన్సులిన్ అవసరం లేకుంటే ఇప్పుడు ఎందుకు ఇస్తున్నారు? ఎందుకంటే ప్రపంచం మొత్తం వారిని తిట్టిపోస్తోంది' అని హిందీలో 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

అసమర్థ ముఖ్యమంత్రి జగన్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండి అని అధికారంలోకి వచ్చిన జగన్‌కు అదే చివరి అవకాశం కావాలన్నారు. కనీస మౌలిక వస్తువుల కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని, రాజకీయ దురుద్దేశంతో రాజధాని అమరావతిని విధ్వంసం చేసి రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మిగిల్చారని విమర్శించారు. అమరావతిని కూల్చి, పోలవరాన్ని ముంచేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్ కే దక్కిందన్నారు. కేంద్రంలో ఈసారి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, రాష్ట్రం లో కూడా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో బటన్ నొక్కి రూపాయి ఇస్తే... చెత్త పన్ను, ఆస్తి పన్ను, అధిక విద్యుత్ చార్జీల పేరుతో పది రూపాయలు లాక్కుంటున్నారని విమర్శించారు. సబ్సిడీపై రైతులకు ఇచ్చే యంత్రాలకు ఎగనామం పెట్టిన ఘనత వైసీపీదేనన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన గాలికొదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉత్తరాంధ్ర నుంచి వలసల నివారణకు పాటుపడతామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రవాసులు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారని, ఉత్తరాంధ్రను కూటమి క్లీన్‌స్వీప్ చేస్తుందన్నారు. వంశధార నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు. పాతపట్నంలో ఐటీడీఏను ఏర్పాటు చేస్తానని తెలిపారు. 100 పడకల ఆసుపత్రి తో పాటు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తానని, స్థానిక వ్యవసాయరంగ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమల ఏర్పాటు చేసి స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రైతు సమస్యల పరిష్కారానికి పూర్తిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తానన్నారు. విధ్వంసానికి మారుపేరయిన వైసీపీని చిత్తుగా ఓడించాలని కోరారు. పాతపట్నం నియోజవర్గ టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇచ్చి నన్ను గెలిపిస్తే ఒక సామాన్యుడిగా సామాన్యుల కష్టాలు తెలిసినవాడిగా మీకు మేలు చేసి తీరుతానని తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు గేదెల చైతన్య, బీజేపీ నాయకులు సలాన శరత్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తపన్ను రద్దు చేస్తాం...

ఆమదాలవలసలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడుతూ... జగన్ ఒక విధ్వంసకారి అని, రూ.13లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, పంటల బీమా అమలు చేస్తామన్నారు. ప్రతి ఎకరాకు నీరిస్తామని, వ్యవసాయ రంగంలో సాంకేతికతను తీసుకువస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తపన్ను రద్దు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

సూరత్ ఎన్నికపై ఈసీ విచారణ జరపాలి

అక్కడ ఎన్నికల ప్రక్రియ తిరిగి ప్రారంభించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికవడంపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్నికలు బీజేపీకి అనుకూలంగా ఏకగ్రీవం అయిన వైనం చూస్తుంటే దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న విషయం స్పష్టమవుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల తేదీకి పక్షం రోజుల ముందు అక్కడ బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు ఈసీ ప్రకటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తి లేని నవ భారతదేశపు ఆవిర్భావాన్ని సూచిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రతిపాదించిన ముగ్గురిలో ఒకరు తాను నామినేషన్ పత్రాలపై సంతకం చేయలేదని అఫిడవిట్ దాఖలు చేయడం విస్మయం కలిగిస్తోందని...ఇది బీజేపీ డబ్బు, కండబలంతో చేస్తున్న దుష్ప్రచారాన్ని సూచిస్తోందన్నారు.

మరోవైపు, జిల్లా ఎన్నికల అధికారి సరైన విచారణ లేకుండా ప్రత్యామ్నాయ కాంగ్రెస్ అభ్యర్థిపై అనర్హత వేటు వేశారు. బీజేపీ మితిమీరిన ప్రభావంతో బీఎస్పీతో సహా మిగిలిన 8 మంది అభ్యర్థులు పోటీ నుంచి వైదొలిగారనేది బహిరంగ సత్యం. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని రక్షించడానికి ఈ విషయంలో తక్షణమే అమలులోకి వచ్చేలా ఎన్నికల సంఘం విచారణ జరిపించాలని నారాయణ డిమాండ్ చేశారు. సూరత్‌లో జనాభాపరంగా శ్రామికవర్గం ఎక్కువగా ఉందని... కేంద్రం, గుజరాత్‌లోని బీజేపీ పాలనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని నారాయణ తెలిపారు. మొత్తంగా చూస్తే... సూరత్ ఎన్నిక ఏకగ్రీవం కావడంపై ఎన్నో అనుమానాలున్నాయన్నారు. తక్షణం ఎన్నికల సంఘం విచారణ చేపట్టి సూరత్‌లో ఎన్నికల ప్రక్రియను పున:ప్రారంభించాలని నారాయణ డిమాండ్ చేశారు.

నిరంతర నిఘా

(మొదటిపేజీ తరువాయి)

ఏమాత్రం ఉండకూడదన్న లక్ష్యంతో మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలను ఎన్నికల సంఘం చేపట్టింది. రాష్ట్రంలో మద్యం తయారీ సంస్థల గోడౌన్ల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో ఏర్పాటు చేసిన వెబ్ కెమేరాల ద్వారా, మద్యం తయారీ సంస్థల నుంచి గోదాములకు, షాపులకు, బార్లకు లేదా ఇతర సంస్థలకు మద్యం సరఫరా చేస్తున్న వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఈ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తుంది.

క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్న లక్ష్యంతో నిరంతరం పర్యటిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సెక్టోరల్ అధికారులు వినియోగించే దాదాపు 1,680 వాహనాలు, ఈవీఎంల రవాణాకు వినియోగించే వాహనాల కదలికలను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఈ కేంద్రం నుంచి పరిశీలిస్తారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ తెలుగు చానళ్లలో నిరంతరాయంగా ప్రసారం అయ్యే వార్తాంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఇందు కోసం ఇద్దరు ఏఎస్‌ఓలతో పాటు దాదాపు 25 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. ప్రముఖ ఆంగ్ల, తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమయ్యే ఎన్నికల ప్రతికూల వార్తాంశాలపైనా తగిన చర్యలు తీసుకునేందుకు దృష్టి సారించారు.

సీఈఓ ముఖేశ్ కుమార్ మీనా స్వయంగా వీటిని పర్యవేక్షిస్తారు.

రేపు పులివెందులలో జగన్ నామినేషన్

లోక్‌సభ, అసెంబ్లీకి పోటాపోటీగా...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల సందడి నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. తొలి రెండు రోజులు నామినేషన్లు తక్కువగా ఉన్నప్పటికీ, క్రమేపీ వాటి సంఖ్య పెరిగింది. నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25వ తేదీతో ముగియనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు పెద్దఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈనెల 18న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీజేసింది. అప్పటి నుంచి జిల్లాల వారీగా వివిధ పార్టీల నేతలు నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికల సందడి ఏర్పడింది. 25తో నామినేషన్లను ముగించి 26న పరిశీలన నిర్వహిస్తారు. 29న నామినేషన్ల ఉపసంహరణ. మే 13న పోలింగ్ నిర్వహించి, జూన్ నాలుగున ఫలితాలను వెల్లడిస్తారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ ప్రముఖులు నామినేషన్లు వేశారు. వైసీపీ నుంచి సీఎం జగన్ గురువారం పులివెందులలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే ఆయన తరపున ఒక సెట్ నామినేషన్‌ను వైసీపీ నేతలు దాఖలు చేశారు. ఇండియా కూటమికి చెందిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్డీఏ కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు నామినేషన్లు వేశారు. కుప్పంలో టీడీపీ అధినేత చంద్రబాబు తరపున ఆమె సతీమణి భువనేశ్వరి నామినేషన్ వేశారు.

పవన్, విజయసాయిరెడ్డి...

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం చాలా నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్డీఏ కూటమి అభ్యర్థులు భారీ ర్యాలీల నడుమ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలివచ్చి నామినేషన్లు సమర్పించారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నామినేషన్ వేశారు. తొలుత చేబ్రోలు నుంచి ఆయన భారీ ర్యాలీతో ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. టీడీపీ గుడివాడ అభ్యర్థిగా వెలిగండ్ల రాము, బీజేపీ ధర్మవరం అసెంబ్లీ అభ్యర్థిగా సత్యకుమార్, టీడీపీ చిలకలూరిపేట అభ్యర్థిగా ప్రత్తిపాటి పుల్లారావు, వైసీపీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతోపాటు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు అబ్బయ్య చౌదరి, దూలం నాగేశ్వరరావు, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ హాజరయ్యారు. వైసీపీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థిగా పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో వైసీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే పేర్ని నాని, పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు. వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వి.విజయసాయిరెడ్డి నామినేషన్ వేశారు. కుటుంబ సభ్యులతోపాటు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తదితరులు విచ్చేశారు. వైసీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేశ్, వైసీపీ కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు నామినేషన్ వేశారు.

ఉపాధి పనులు చేపట్టండి

కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉపాధి హామీ పనుల నిర్వహణకు ఇది అనుకూల సమయమని, అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు, ఉపాధి పనులు, నీరు, విద్యుత్ సరఫరాపై సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు సకాలంలో కూలి చెల్లించాలని సూచించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాల్వ ద్వారా విడుదల చేసిన నీటితో చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ట్యాంకులు ద్వారా మంచినీటిని సరఫరా చేసే ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ సరఫరాపై వినియోగదారుల నుంచి ఏవిధమైన ఫిర్యాదులు వస్తున్నాయి, వాటిని ఎంత సమయంలో పరిష్కరిస్తున్నారు... తదితర అంశాలపై ట్రాన్స్ కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర జల వనరులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్... సోమవారం 22 లక్షల 59 వేల మంది కూలీలకు ఉపాధి పని కల్పించినట్లు వివరించారు. ఈనెల తొమ్మిదో తేదీ వరకు కూలీ చెల్లించామన్నారు. రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో పనులు చేపట్టేందుకు వీలుగా స్వయం ఉపాధి పనులు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. తాగునీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకులు ద్వారా మంచి నీటిని సరఫరా చేసేందుకు 13 జిల్లాల నుంచి ప్రతి పాదనలను వచ్చాయని వివరించారు. ప్రస్తుతం 234 ఆవాసాలకు ట్యాంకులు ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ జెన్కో ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు సరాసరిన 245 నుంచి 250 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందన్నారు. డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వినియోగదారుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, జల వనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణ రెడ్డి, విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్, సీఎండీ సంతోశ్‌రావు, గ్రిడ్ డైరెక్టర్ కేవీ భాస్కర్ పాల్గొన్నారు.

హమాలీల ఉపాధికి ఎఫ్‌సీఐ గండి

– ఎస్.వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర-విజయవాడ: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూట్ క్రమబద్ధీ కరణ చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఎమ్మెల్యేల పాయింట్‌కు దాదాపు 50 నుంచి 65 డీలర్ల షాపులు తగ్గించటం ద్వారా రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ హమాలీల ఉపాధికి గండి కొడుతుందని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మండల స్టాక్ పాయింట్లు నందు లోడింగ్, అన్ లోడింగ్ పనులు నిర్వహించే హమాలీలకు పని లేకుండా పోతుందన్నారు. ఈ మండుటెండల్లో హమాలీలకు ఉపాధి లేకుండా చేయడానికి సివిల్ సప్లయిస్ కమిషనర్ అరుణ్ కుమార్, కార్పొరేషన్ ఎండీ ప్రయత్నం చేస్తున్నారని, ఇది చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పద్ధతిలోనే స్టాక్ సరఫరా కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో సమయంలో ఇలాంటి చర్యలు చేపట్టి కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం తగదని హితవు పలికారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాలలో సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో హమాలీలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో పని బంద్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల వేళ ప్రజలకు బియ్యం సరఫరా చేయడంలో హమాలీలు కష్టపడి నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇలాంటి నిర్ణయం తీసుకోవటం వల్ల తనకే నష్టం కలుగుతుందని హెచ్చరించారు.

రైతు ద్రోహి మోదీ

- బీజేపీ శ్రేణులను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టండి
- 'ఇండియా' అభ్యర్థులను గెలిపించండి
- ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర-ఒంగోలు : పంటలకు మద్దతు ధరపై ఉద్యమం చేసేందుకు రైతులను ఢిల్లీకి రానీయకుండా అడ్డుకున్న బీజేపీని ఈ ఎన్నికల్లో గ్రామాల్లోకి రానివ్వకుండా తరిమి కొట్టాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల వెంకయ్య మాట్లాడుతూ దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసి, వ్యవసాయాన్ని లాభసాటిగా నడిపిస్తానని వాగ్దానాలు చేసిన నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతలను నిలువునా ముంచి మోసం చేశారని ధ్వజమెత్తారు. పంటల పెట్టుబడి ఖర్చు మూడు రెట్లు పెంచి దేశానికి అన్నం పెట్టే అన్నదాతల నడ్డివిరిచారన్నారు. కార్పొరేట్ శక్తుల కనుసన్నలలో మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి రైతులను నిండా ముంచేందుకు ప్రయత్నించారని విమర్శించారు. మోదీ మోసాన్ని ముందే గ్రహించిన రైతులు ఢిల్లీ శివారు ప్రాంతంలో 13 నెలల పాటు సుదీర్ఘ ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. అయితే రైతులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోదీ మరోసారి తన వికృత చేష్టలను ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ 10 ఏళ్ల పాలనలో దేశవ్యాప్తంగా మూడున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, అయినప్పటికీ రైతుల పట్ల మోదీ ప్రభుత్వం మరింత నిరంకుశంగా ప్రవర్తిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను, నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికులను మరింత బానిసలుగా మార్చారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై ధరల భారాలు మోపారని దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 14 మంది ప్రధాన మంత్రులు పనిచేయగా వారు కేవలం రూ.56 లక్షల కోట్లే అప్పులు చేశారన్నారు. అయితే మోదీ 10 ఏళ్ల పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు తెచ్చారన్నారు. అయితే ఈ రుణాలు ఎవరికి ఖర్చు చేశారో మోదీ చెప్పాలన్నారు. రానున్న ఎన్నికలలో మోదీ ప్రభుత్వాన్ని ఓడించినప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం వెల్లివిరుస్తుందన్నారు. పంజాబ్, హరియానాలో బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అక్కడి రైతాంగం ఎలా గ్రామాల్లోకి రాకుండా అడ్డుకున్నారో, మన రాష్ట్రంలో కూడా రైతులు... బీజేపీ, దాని పొత్తు పార్టీల అభ్యర్థులను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటకు మద్దతు ధర చట్టబద్ధంగా చేసే, రుణ మాఫీ చేసే, నూతన విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించే 'ఇండియా' కూటమి అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మకు రెండు గేట్లు కూడా పెట్టలేని వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందంటే ఎలా నమ్మాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అనేక సార్లు అబద్ధాలాడిన ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు ఎలా నమ్మాలో చెప్పాలన్నారు. ఎన్నికల్లో 'ఇండియా' కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతుగా నిలిచి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు పోలవరపు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీలకు ఓటేస్తే... బీజేపీకి వేసినట్టే: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: టీడీపీ, వైసీపీలకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బాపట్ల జిల్లా కర్లపాలెం ఐలాండ్ సెంటర్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షర్మిల మాట్లాడుతూ మతం పేరుతో దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ... బీజేపీతో త్రికోణ ప్రేమాయణం సాగిస్తున్నాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు బహిరంగ పొత్తు పెట్టుకుంటే జగన్ అక్రమ పొత్తు పెట్టుకున్నారన్నారు. టీడీపీ హయాంలో కిటికీలు తెరిచి దోపిడీ చేస్తే వైసీపీ హయాంలో ఏకంగా తలుపులే తెరిచి దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు గడిచిన రాజధాని లేదన్నారు. జగన్... హామీలను అమలు చేయకుండా ఓట్లు అడగటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.రెండు లక్షలు రైతు రుణమాఫీ చేస్తామన్నారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి జేడీ శీలంను, బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దోనేపూడి దేవరాజ్, పఠాన్‌రాజేశ్, బాబురావు, రోశయ్య, రేణుక పాల్గొన్నారు.

చంద్రబాబుపై చర్యలకు సీఈసీకి సిఫార్సు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుపై చర్యలకు కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా సిఫార్సు చేసినట్లు వైసీపీ నేతలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో సీఎం జగన్‌పై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆధారాలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వైసీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. వీటిలో 18 ఫిర్యాదులకు సంబంధించి చంద్రబాబుకు నోటీసులు జారీచేశారు. వివరణ ఇవ్వాలంటూ చంద్రబాబుకు ఇచ్చిన నోటీసుల్లో కొన్నింటికి మాత్రమే ఆయన సమాధానం ఇచ్చి, మరికొన్నింటికి స్పందించలేదు. ఆయా సమాధానాలపై సంతృప్తి చెందని సీఈవో మీనా ప్రాథమికంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయానికి వచ్చారు. ఆధారాలతో సహా వీడియో క్లిప్పింగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. తదనంతరం చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఈసీఐ ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్‌కు లేఖ రాశారు.

వడ్డెరలకు జగన్ ప్రాధాన్యం: తన్నీరు ధర్మరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వడ్డెరలకు అన్ని రంగాల్లో సీఎం జగన్ ప్రాధాన్యత ఇచ్చారని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు అన్నారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో వడ్డెర్లకు రాజకీయంగా ఎలాంటి ప్రాధాన్యతా ఇవ్వలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకే వడ్డెర్ల మద్దతు ఉంటుందన్నారు. తిరిగి జగన్‌ను సీఎం చేసుకుంటామని చెప్పారు. వడ్డెర్లు అత్యధికంగా ఉన్న నియోజక వర్గాల్లో పర్యటించి వైసీపీకి మద్దతు తెలిపేలా ప్రచారం చేస్తామన్నారు. వడ్డెరలు రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి, ఎదుగుదలకు తోడ్పడిన వైసీపీకి ఎన్నికల్లో మద్దతిస్తున్నట్టు చెప్పారు. తనను శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నియమించి గుర్తింపు ఇచ్చారన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా వడ్డెర్లను నియమించారని, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గాను, డైరెక్టర్లగాను వడ్డెర కులస్థులు నియమితులై వడ్డెర్ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు ప్రతి వడ్డెర కుటుంబానికి చేరుతున్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా వైఎస్ కుటుంబం తప్ప... వడ్డెరల గురించి పట్టించుకున్న నాథుడు లేడని అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాజకీయంగా, సామాజికంగా వడ్డెరలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే త్యాగాలు

పిఠాపురం అసెంబ్లీ జనసేన అభ్యర్థిగా పవన్ కల్యాణ్ నామినేషన్

విశాలాంధ్ర-పిఠాపురం/కాకినాడ: ఐదేళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ ప్రభుత్వ దమన కాండకు చరమగీతం పలికే సమయం ఆసన్నమైందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రానికే కాదు... భవిష్యత్ తరాలకు ఎంతో కీలకమైనవని, అందుకోసం టీడీపీ, బీజేపీతో కలిసి ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షంగా ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ మంగళవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పిఠాపురం ఎంపీడీఓ కార్యాలయంలో పవన్ జనసేన పార్టీ తరపున పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి రామసుందర రెడ్డికి అందజేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ మిగిలిన పార్టీలతో సమంగా బలం పుంజుకున్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగాలు చేసి ముందుకు వెళుతున్నామన్నారు. మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం లాంటి 40 నియోజకవర్గాల్లో బలమైన ప్రజా నాయకులు పార్టీలో ఉన్నప్పటికీ పోటీ నుంచి విరమించుకోవాల్సి వచ్చిందన్నారు. పిఠాపురంలోనూ బలమైన నాయకుడు, ప్రజా సమస్యల మీద అవగాహన వర్మ నా కోసం సీటు త్యాగం చేశారని, ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు తెలిపారు. ఈ త్యాగం రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని, వారికి భవిష్యత్తులో ఉన్నత స్థానం లభించాలని కోరుకుంటూ దానికి తన వంతు కృషి ఉంటుందన్నారు. కాకినాడ పార్లమెంటు అభ్యర్థిగా టీ టైమ్ వ్యవస్థాపకుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పోటీ చేస్తున్నారని, ఇలాంటి వ్యక్తులు ఎంపీగా ఎన్నిక అయితే మన ప్రాంతంలో ఉపాధి అవకాశాల కోసం, ఓఎన్జీసీ కాలుష్యం తదితర అంశాలపై బలంగా గళం విప్పగలరని తెలిపారు. ఇక్కడ తమకు మద్దతు ఇచ్చిన బీజేపీ నాయకులు బుర్రా కృష్ణంరాజుకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు. ఎన్‌డీఏ కూటమి అఖండ విజయం సాధించబోతోందని, దానికి నేటి నామినేషన్‌కి మద్దతుగా తరలివచ్చిన ఆశేష ప్రజానీకమే తార్కాణమని పవన్ కళ్యాణ్ చెప్పారు.

ఇళ్లకు తీసుకువెళ్లి పెన్షన్ ఇవ్వకపోతే అది ప్రభుత్వ కుట్రే...

మే నెల ఒకటో తేదీన సామాజిక పింఛన్లు ఇళ్లకు తీసుకువెళ్లి ఇవ్వకపోతే దాని వెనుక ప్రభుత్వ కుట్ర ఉన్నట్లేనని పవన్ కళ్యాణ్ అన్నారు. 'ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ప్రభుత్వ అధికారులు అడ్డంకులు కలిగించకపోతే పింఛన్ ఇంటికే చేరుతుంది. ఈ ప్రభుత్వం చేతిలో నలిగిపోయిన మీడియాకి మేము అండగా ఉంటాం. మీ కష్టాల్లో పాలు పంచుకుంటాం. గతంలో ముక్కోణపు పోటీ ఉంది. ఇప్పుడు ఉమ్మడిగా ముందుకు వెళ్లడం వల్ల సమస్యలపై మరింత బలమైన పోరాటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, టీడీపీ పిఠాపురం ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌ఛార్జ్ బుర్రా కృష్ణంరాజు, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పార్టీ లీగల్ సెల్ చైర్మన్ ఇవన సాంబ శివప్రతాప్, జనసేన ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు మర్రెడ్డి శ్రీనివాస్, టీడీపీ యువ నాయకులు గిరీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా... భారీ ర్యాలీ నడుమ...

పవన్ కల్యాణ్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో జాతీయ జెండాలతో పాటు జనసేన, టీడీపీ, బీజేపీ జెండాల రెపరెపల నడుమ భారీ ర్యాలీగా వెళ్లారు. జనసేన అధినేత ఉదయం 9.30 గంటలకు చేబ్రోలులోని తన నివాసంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటికే వేలాదిగా తరలివచ్చిన జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు గోకుల్ గ్రాండ్ హోటల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నామినేషన్ దాఖలు చేయడానికి బయలుదేరిన పవన్ కళ్యాణ్‌కు పిఠాపురం టీడీపీ ఇన్‌ఛార్జ్ వర్మ, ఆయన సతీమణి హారతులు పట్టి వీర తిలకం దిద్ది సాగనంపగా, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఆశీర్వదించారు. వేద పండితులు, క్రైస్తవ మత పెద్దలు దీవెనలు ఇచ్చారు. అనంతరం గొల్లప్రోలు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుని ప్రచార రథం మీదకు ఎక్కి పవన్ కళ్యాణ్ ర్యాలీగా గొల్లప్రోలు ఎమ్మార్వో ఆఫీస్, బస్టాండ్ సెంటర్, పిఠాపురం దూళ్ల సంత, చర్చ్ రోడ్డు మీదుగా సుమారు మూడు గంటల పాటు రోడ్ షో నిర్వహించారు.

విశాఖ ఉక్కుపై మాది రాజీలేని పోరాటం

కార్మికులకు అండగా ఉంటాం

పోరాట సమితికి సీఎం జగన్ హామీ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖఉక్కు ప్రైవేటీకరణ కాకుండా రాజీలేని పోరాటం చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర చేస్తున్న సీఎం జగన్‌ను విశాఖ సమీపంలోని ఎండాడ వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి (కార్మిక సంఘం) నాయకులు మంగళవారం కలిశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ఆయనకు నివేదించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులతో సీఎం జగన్ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ కార్మికుల పక్షాన నిలబడతాయన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల తరపున మొట్టమొదట గళమెత్తింది తామేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకుండా సమస్యకు పరిష్కారాలను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వమే ప్రధానికి లేఖ రాసిందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం కూడా చేసిందని గుర్తు చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్ సీపీది రాజీలేని ధోరణి అని స్పష్టం చేశారు. ఇనుప ఖనిజం గనులను కేటాయించడం ద్వారా ప్లాంట్ పరిస్థితి మెరుగుపడుతుందని, ప్లాంట్ పునరుద్ధరణకు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కార్మికుల మద్దతును కోరే నైతికత కేవలం వైఎస్ఆర్‌సీపీకి మాత్రమే ఉందని, ఎందుకంటే తమ పార్టీ మాత్రమే కార్మికులకు అండగా నిలిచిందని ఆయన చెప్పారు.

ఎన్నికల కోసం పొత్తు పెట్టుకున్న టీడీపీ, బీజేపీ స్టీల్ ప్లాంట్ పై నిర్ణయాన్ని స్పష్టం చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలపై దెబ్బ కొడుతున్నారని సీఎం జగన్ మండిపడ్డారు. కూటమిగా ఏర్పడిన (టీడీపీ, జనసేన, బీజేపీ) పార్టీలు స్టీల్ ప్లాంట్ విషయంలో తమ నైతికతను, విలువలు మరిచాయని విమర్శించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్‌లు డి ఆదినారాయణ, సీహెచ్ నర్సింగరావు, నాయకులు మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మే 1కి శిరోముండనం కేసు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శిరోముండనం కేసు విచారణను మే 1వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. ఆ కేసులో విశాఖపట్నం కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను హైకోర్టు మంగళవారం విచారించింది. వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మంది ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం బాధితులను ప్రతివాదులుగా చేర్చాలని సూచించింది. దళిత యువకులకు అమానవీయంగా శిరోముండనం చేసి, మీసాలు, కనుబొమ్మలు తీసేయించిన ఘటనపై విశాఖ కోర్టు శిక్ష విధిస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ చట్టాల ప్రకారం మొత్తం తొమ్మిది మంది నిందితులకు 18 నెలల సాధారణ జైలుశిక్ష, ఒక్కొక్కరికీ రూ.42 వేల జరిమానా విధించింది. 1996 డిసెంబరు 29న దళితులకు శిరోముండనం చేశారన్న ఆరోపణలపై తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం ఠాణాలో అప్పటి ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు, మరికొందరిపై 1997 జనవరి 4న మొత్తం 10 మంది నిందితులపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో ఆరో నిందితుడు మరణించగా, మిగిలిన నిందితులపై విశాఖ కోర్టు విచారించి ఇటీవల తీర్పునిచ్చింది. దళిత యువకులకు శిరోముండనం ఘటనలో తోట త్రిమూర్తులు దోషి అని విశాఖపట్నం కోర్టు తీర్పునిచ్చింది. ఆయనతో పాటు మరో ఎనిమిది మందీ దోషులేనని స్పష్టం చేసింది. ఈ తీర్పుపై దళిత, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తోట త్రిమూర్తులు పోటీ చేస్తున్నారు. దీంతో ఈ కేసు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

బండమీద వెంకటేశ్వర్లు ఆశయాలు కొనసాగించాలి

విశాలాంధ్ర ఆస్పరి: బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు, పేద ప్రజల నాయకుడు, ఎర్రజెండా ముద్దుబిడ్డ, పెత్తందార్ల సింహ స్వప్నం కామ్రేడ్ బండమీద వెంకటేశ్వర్లు అని సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కొనియాడారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆస్పరి మండలం పుప్పాలదొడ్డి గ్రామంలో బండమీద వెంకటేశ్వర్లు 40వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని మారెమ్మ దేవాలయం నుండి పురవీధుల గుండా వెంకటేశ్వర్లు స్థూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థూపం వద్ద వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు కామ్రేడ్ వెంకటేశ్వర్లు అమర్ రహే... అమరుల ఆశయాలను కొనసాగిస్తాం అంటూ నినాదాలు చేస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో గిడ్డయ్య మాట్లాడుతూ వెంకటేశ్వర్లు నమ్మిన సిద్ధాంతం కోసం ఎర్రజెండా చేతపట్టి మార్క్సిజం, లెనినిజంను ప్రజలకు వివరిస్తూ వారికి అండగా ఉంటూ కమ్యూనిస్టు పార్టీ జెండాను ముందుకు తీసుకెళ్లారన్నారు. ఆనాడు భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా అంటరానితనం, వెట్టిచాకిరి నుండి పేద ప్రజల విముక్తి కోసం ముందుండి పోరాటం కొనసాగించారన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో చదువుల రామయ్య నాయకత్వంలో కారుమంచి పీర్కా గ్రామాల్లో పెద్ద ఎత్తున పోరాడి అనేక గ్రామాలను విముక్తి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ బలపడితే తమ ఆటలు సాగవని గ్రహించిన భూస్వామ్య పెత్తందారులు 1984 ఏప్రిల్ 23న వెంకటేశ్వర్లును అత్యంత క్రూరంగా హత్య చేశారని తెలిపారు. గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీని, ప్రజాసంఘాలను బలోపేతం చేయాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి త్వరలో జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని, వైఎస్సార్‌సీపీని ఓడించాలన్నారు. నేటి యువత వెంకటేశ్వర్లు ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు అడ్వకేట్ సురేంద్ర కుమార్, మండల నాయకులు రంగన్న, నరసప్ప, వీరేష, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ముద్దు రంగన్న, శ్రీనివాసులు ఎల్లప్ప, ఆంజనేయ, లక్ష్మన్న, రామిరెడ్డి, రంగన్న, రాగులయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రమేష్, రంగప్ప, సురేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అనిల్, జస్వంత్, వివిధ గ్రామాల పార్టీ కార్యదర్శులు పాల్గొన్నారు.

22 రోజులు... 2,100 కిలోమీటర్లు...

'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ముగింపు నేడు

సభలు, రోడ్‌షోలతో జగన్ ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్ర బుధవారంతో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. గత నెల 27న వైఎస్ఆర్ కడప జిల్లా ఇడుపులపాయ నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. 22 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాల మీదుగా జగన్ యాత్రను నిర్వహించారు. మొత్తం 2,100 కిలోమీటర్ల మేర బస్సు యాత్ర ద్వారా ప్రయాణించారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా 16 సభలు, తొమ్మిది రోడ్ షోలు, వివిధ విభాగాలతో ఆరు ప్రత్యేక ముఖాముఖీ సమావేశాల్ని నిర్వహించారు. మార్గమధ్యలో ప్రజలతో మమేకం అవడం, వారి సమస్యల్ని అడిగి తెలుసుకుని వినతిపత్రాల్ని స్వీకరించారు. తొలుత ప్రాంతాల వారీగా నాలుగు సిద్ధం సభలను వైసీపీ నిర్వహించింది. విశాఖజిల్లా భీమిలిలో తొలి సిద్ధం సభను నిర్వహించారు. రెండోది దెందులూరు, మూడోది అనంతపురంజిల్లా రాప్తాడు, నాలుగవ సిద్ధం సభను ఉమ్మడి ప్రకాశంజిల్లాలో నిర్వహించారు. అనంతరం మళ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల ప్రచారానికి జగన్ సన్నద్ధమవ్వగా, ఈలోగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు నాలుగో దశకు చేరడంతో, రెండు నెలల సమయం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని జగన్ బస్సు యాత్రలకు షెడ్యూలు రూపొందించారు. సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాలను మినహాయించి, మిగిలిన అన్ని జిల్లాల్లోనూ బస్సు యాత్రను కవర్ చేశారు. ఆయా ప్రాంతాల్లో మినీ సిద్ధం సభలను నిర్వహించారు. బస్సు యాత్రలో భాగంగా ఈనెల 13వ తేదీ రాత్రి జగన్ విజయవాడకు చేరుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ వద్ద జగన్‌పై దాడి చేయడం, అతడి నుదిటిపై తీవ్రగాయం కాడంతో 14వ తేదీ బస్సు యాత్రకు విరామం ఇచ్చారు. 15 నుంచి యథాతథంగా బస్సు యాత్రతో జగన్ ముందుకెళ్లారు. దీంతో వైసీపీ శ్రేణులు కొంత ఊరట చెందారు. దాంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి వైసీపీలోకి భారీ చేరికలు కొనసాగాయి. జగన్ సమక్షంలో 221 మంది రాష్ట్రస్థాయి నేతలు కండువాలు కప్పుకున్నారు. వీరితోపాటు లక్షా ఐదు వేల మంది వివిధ పార్టీల క్రియాశీలక కార్యకర్తలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచి అత్యధికంగా ఎన్డీయే కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి చేరికలు కొనసాగాయి. వీరిలో 2019లో టీడీపీ, జనసేన నుంచి పోటీ చేసిన నేతలున్నారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేరికలపై వైసీపీ దృష్టిపెట్టింది. బస్సు యాత్రలు ముగిసిన అనంతరం మళ్లీ రెండో విడత ఎన్నికల ప్రచార సభల నిర్వహణకు సీఎం సిద్ధమయ్యారు. త్వరలో దీని షెడ్యూలు విడుదల కానుంది. సిద్ధం, మేమంతా సిద్ధం సభలు జరిగిన నియోజకవర్గాలను మినహాయిస్తారు. హెలీకాప్టర్ ద్వారా జగన్ రోజుకు మూడు సభలు (ప్రాంతానికి ఒకటి చొప్పున) నిర్వహించేలా షెడ్యూలు రూపొందించనున్నారు. అవసరమైన చోట్ల రోడ్‌షోలు నిర్వహిస్తారు.

విశాఖ ఉక్కుపై జగన్‌ది మోసపూరిత వైఖరి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులకు అండగా ఉంటాన్న సీఎం జగన్... మోసపూరిత వైఖరి అవలంబిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాది క్రితం పోరాట కమిటీ నాయకులు కలుస్తామంటే అవకాశం ఇవ్వని జగన్... ఇప్పుడు ఎన్నికల కోసం వారిని పిలిపించుకుని మాట్లాడటంలో నిజాయితీ లేదన్నారు. కనీసం వారిని కలిసిన సందర్భంలోనైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపేందుకు తాను నిలబడతానని చెప్పకపోవడం విచారకరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో ఉన్న గనులను కేటాయించేందుకు కూడా హామీ ఇవ్వలేదని, ఈ మూడేళ్లలో ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా ఒక్కసారి కూడా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపమని ప్రధానిని అడిగిన పాపాన పోలేదని గుర్తుచేశారు. ప్రధాని విశాఖ వచ్చిన సందర్భంలోనూ ఆయనకు కనీసం అర్జీ ఇవ్వలేదని... ఇప్పుడు ఓట్లకోసం కార్మికులను మోసగించేందుకు ప్రకటన చేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బీజేపీకి భయపడి విశాఖ ఉక్కును ఫణంగా పెట్టడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు విషయంలో వైసీపీ, టీడీపీ, జనసేనలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మూడు పార్టీలు ఒకవైపు ప్రైవేటీకరిస్తున్న బీజేపీకి మద్దతునిస్తూ మరోవైపు పోరాడుతున్న కార్మికుల పక్షం తామున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా వీరి అసలు రంగును గుర్తించాలని కార్మికులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్న వామపక్షాలను ఈ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు.

సతీశ్ కస్టడీ పిటిషన్‌పై తీర్పు నేడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌పై రాయి దాడి కేసులో నిందితుడు సతీశ్ కస్టడీపై తీర్పును బుధవారానికి విజయవాడ కోర్టు వాయిదా వేసింది. బస్సు యాత్రలో భాగంగా ఈనెల 13న విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ వద్ద జగన్‌ను రాయితో గాయపరిచిన వేముల సతీశ్ అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అతడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులో మరింత విచారణ కోసం పోలీసులు కస్టడీ పిటిషన్ వేశారు. దీనిపై వాదోపవాదనలు జరిగిన అనంతరం తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. నిందితుడి తరపున న్యాయవాది సలీమ్ కౌంటర్ దాఖలు చేశారు. సతీశ్‌పై ఏ1గా కేసు నమోదు చేశారు. మరికొంత మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వదిలేశారు. వారిలో వడ్డెర కాలనీకి చెందిన టీడీపీ బీసీ సెల్ నాయకుడు దుర్గారావు ఉన్నారు. ఇదే కేసులో రాజకీయ జోక్యం ఉందన్న విమర్శలున్నాయి. దానిపైనా పోలీసుల విచారణ కొనసాగుతున్నది. సీఎంపై దాడి కేసులో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఆరా తీశాయి. దీంతో విజయవాడ నగర పోలీసు కమిషనర్ క్రాంతి రాణా టాటా ఎన్నికల అధికారులకు ప్రాథమిక నివేదిక అందజేశారు. ఈ కేసు విచారణ కోసం ఎస్పీ అధ్వర్యంలో ఎనిమిది బృందాలతో సిట్‌ను ఏర్పాటు చేశారు. దాడి జరిగిన మరుసటి రోజే సతీశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్ బధిరాంధత

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నోరు తెరిచి ఎప్పుడైనా నిజం చెప్పారన్న అనుమానం బహుశ: ఆయన భక్త జనానికి కూడా ఉండి ఉండదు. కానీ ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రచారంలో పెడ్తున్న అభద్ధాలు శ్రుతి మించి పోతున్నాయి. పాత అబద్ధాలను అలసట, విరామం లేకుండా వల్లించడంతో పాటు రోజుకో సరికొత్త అబద్ధమాడుతూనే ఉన్నారు. ఈ అసత్యాల పరమ లక్ష్యం ముస్లింల మీద విద్వేషం నింపడం. 80 శాతం ఉన్న హిందువుల ఓట్లలో అత్యధిక శాతం బీజేపీకే దక్కాలన్న ఉద్దేశంతో ముస్లింలను హిందువులకు ప్రధాన శత్రువులుగా చూపిస్తున్నారు. అధికారంలో ఉన్న పది ఏళ్ల కాలంలో ఒరగబెట్టింది ఏమిటో చెప్పుకోవడానికి ఎటూ అవకాశం లేనందువల్ల ఓ వేపు అసత్య ప్రచారం, మరో వేపు ముస్లింల విద్వేషం నింపడం ఆయన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ప్రధానాంశమై పోయింది. ఒకప్పుడి బీజేపీకి మిత్ర పక్షంగా ఉండి రైతుల ఉద్యమ సమయంలో తెగతెంపులు చేసుకున్న అకాలీ దడల్ కు సైతం మోదీ అబద్ధాలు గొంతు దిగడం లేదు. ఇవాళ ఆయన ముస్లింల మీద విరుచుకు పడుతున్నారు రేపు సిక్కుల మీద మండి పడతారు అని అకాలీ దళ్ బాహాటంగానే నిరసన వ్యక్తం చేస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కనక అధికారంలోకి వస్తే దేశ సంపదను "అధిక సంతానంగల చొరబాటు దార్లకు" పంచి పెడ్తుంది అని మోదీ దుష్ప్రచారానికి దిగారు. అధిక సంతానం ఉన్న వారు అంటే ఆయన అభిప్రాయం ముస్లింలు అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. "మీరు కష్టపడి సంపాదించిన సొమ్ము "చొరబాటుదార్లకు పందేరం చేస్తే మీరు సహిస్తారా?" అని బహిరంగ సభకు తరలించుకు వచ్చిన జనాన్ని మోదీ ప్రశ్నించారు. బీజేపీ సకల విధ ప్రలోభాలు కల్పించి తరలించగా వచ్చిన వారు "సహిస్తాం" అని ఎలా సమాధానం చెప్పగలరు? "మనకు జరిగిందే అన్యాయం అనుకోవడం మన తత్వం. ఇవాళ వాళ్ల వంతైతే రేపు మన వంతూ వస్తుంది" అని అకాలీ దళ్ అధికార ప్రతినిధి పరమహన్స సింగ్ రొమన అన్నారు. కాంగ్రెస్గనక గెలిస్తే మీ ఇళ్లన్నీ సఒదా చేసి మంగళ సూత్రాలతో సహా మీ సంపత్తినంతా దోచుకును "చొరబాటుదార్లకు" పంచేస్తారు అని మోదీ గత రెండు రోజులుగా పాడిందే పాటగా చెప్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో లేని విషయాలను కూడా ఉన్నట్టు చిత్రీకరించి జనాన్ని భయపెట్టడానికి మోదీ ఏ అవకాశమూ వదిలిపెట్టడం లేదు. ఆయన ప్రసంగాల ధోరణిని నిశితంగా పరిశీలించి చూస్తే ఓటమి భయం ఆయనను వెంటాడుతోందని, నిరాశకు గురైనందువల్లే ఇలా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించడం సులభమే. కానీ ఇలాంటి మాటలన్నీ గుండెలోతుల్లోంచి వచ్చినవేనని గ్రహించడానికి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఆయన ప్రసంగాల ధోరణి గమనిస్తే అర్థం అవుతుంది. 19వ తేదీన జరిగిన మొదటి దశ పోలింగ్ పై జనం అంతగా ఉత్సాహం కనబరచలేదని విశ్లేషకులు వింగడిస్తున్నారు. ఇందులో నిజం ఎంతో ఊహ ఎంతో జూన్ నాల్గవ తేదీనగానీ తేలదు. ఎస్.సి./ఎస్.టి./ఒ.బి.సి.లకైతే తాను రిజర్వేషన్లు అమలు చేస్తాను కానీ మత ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు కల్పించే ప్రశ్నే లదని మోదీ ఎవరూ అడక్కుండానే నొక్కి చెప్పారు. ఆయన పేర్కొన్న రిజర్వేషన్లలో మొదటి రెండు వర్గాలకు రాజ్యాంగామే ఆ సదుపాయం కల్పించింది. ఇందులో మోదీ ఘనత ఇసుమంత కూడా లేదు. ఒ.బి.సి.ల రిజర్వేషన్లకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఇతర వెనుకబడిన వర్గాల వారి అభ్యున్నతి గురించి కూడా ఆలోచించాలని డా. బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ రచన పూర్తి అయిన తరవాతే చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే దీనికోసం ప్రయత్నం ప్రారంభమైన విశ్వాథ్ ప్రతాప్ సింగ్ ప్రధానమంత్రి అయ్యే దాకా ఒ.బి.సి.లకు రిజర్వేషన్ల సదుపాయం కలగనే లేదు. ఒ.బి.సి. వర్గానికి చెందక పోయినా తన కులాన్ని ఒ.బి.సి. జాబితాలో చేర్పించిన మోదీ నుంచి అసత్యం తప్ప మరేదీ ఆశించలేం.

కానీ మొదటి దశ పోలింగ్ బీజేపీ నాయకులను, ముఖ్యంగా బీజేపీని గెలిపించే బృహత్తర బాధ్యతను బుజాన వేసుకున్న మోదీని బెంబేలెత్తిస్తోంది. అందుకే దిక్కు తోచని స్థితిలో మోదీ రెచ్చి పోయి మాట్లాడుతున్నారు. మొదటి సార్వత్రిక ఎన్నికల నుంచి ఇప్పటి దాకా ఏ ప్రధానమంత్రి ఇలా విషవమనానికి పాల్పడలేదు. అసత్యాలను ప్రచారం చేసే వారిని సహించేదే లేదని, వారి మీద చర్య తీసుకుంటామని ఎన్నికల కమిషన్ ప్రధానాధానాధికారి రాజీవ్ కుమార్ హుంకరిస్తున్నారు. అసత్య ప్రచారం చేసే వారి ప్రస్తుత మాటలనే కాక గతంలో వారి అబద్ధాలను కూడా పరిగణనలోకి తీసుకుని చర్య తీసుకుంటున్నామై గుప్పిళ్ల కొద్దీ హామీలు పడేస్తున్నారు. అన్ని బీరాలు పలికే రాజీవ కుమార్ ఎన్ని ఫిర్యాదులు అందినా మోదీకు ఒక్క నోటీసైనా జారీ చేయడానికి సాహసించలేదు. ఇక ఇంతకు ముందు మోదీ చెప్పిన అబద్ధాల మీద ఎన్నికల కమిషన్ చర్య తీసుకుంటుందని ఎలా నమ్ముతాం. ఎన్నికల కమిషన్ చరిత్ర పొడవునా అధికారంలో ఉన్న పక్షం అడుగులకు మడుగులొత్తని ఎన్నికల కమిషన్ ప్రధానాధికారులను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఈ జోకుకుందారీ బానిస మనస్తత్వం మోదీ హయాంలో వచ్చింది కాదు. అలాంటప్పుడ్ సకల రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసింది మోదీ అయితే ఆయన మీద పల్లెత్తి ఒక్క మాటైనా మాట్లాడే సాహసం రాజీవ్ కుమార్ చెస్తారని ఎలా అనుకోగలం? అసలు ఎన్నికల కమిషన్ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా తయారైంది. ఏడు విడతల్లో పోలింగ్ నిర్వహించడమే ఎన్నికల కమిషన్ ప్రదర్శిస్తున్న రాజును మించిన రాజభక్తికి తార్కాణం. ప్రజాస్వామ్య వ్యవస్థకు కాపలాదారుగా ఉంటూ ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రధాన భాగమైన ఎన్నికలను నిష్పక్షపాటంగా నిర్వహించవలసిన బాధ్యత ఉన్న ఎన్నికల కమిషన్ మాయమై పోయి ఏళ్లు గడుస్తోంది. అబద్ధాలడి తప్పించుకోవడానికి, విద్వేష ప్రచారం చేయడానికి ఇక అవకాశం లేదని గత 16వ తేదీన గంభీరమైన ప్రకటనలు గుప్పించిన రాజీవ్ కుమార్ కు మోదీ చెప్పే అసత్యాలు, కొనసాగించే విద్వేష ప్రచారం వినిపించడం లేదంటే ఎలా నమ్ముతాంగనక. అభివృద్ధి అన్న మోదీ మంత్రం పారడం లేదు. ఎందుకంటే దశాబ్ద కాలంగా అభివృద్ధి జాడే కనిపించలేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, తన మిత్ర బృందానికి దేశ వనరులను దోచి పెట్టడం లాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము మోదీకి లేదు. అందుకే మళ్లీ హిందు-ముస్లిం రాజకీయ అస్త్రానికి సానబడ్తున్నారు. విద్వేషం వరదై పారుతోంది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో లేని అంశాలను ప్రస్తావిస్తూ మోదీ దుష్ప్రచారం కొనసాగిస్తూ ఉంటే ఎన్నికల కమిషన్ చేతులు ముడుచుకుని ఎందుకు కూర్చున్నట్టు? మోదీ మీద చర్య తీసుకోవడానికి ఎందుకు భయపడుతున్నట్టు? మోదీ నోటిని ఎందుకు అదుపు చేయడం లేదు?

ప్రజాస్వామ్యమా... ఉన్నావా?



వి. శంకరయ్య

ఉన్నావా... అసలున్నావా...

ఉంటే కళ్లు మూసుకున్నావా... లోకం కుళ్లు చూడకున్నావా... అంటూ భక్త తుకారం సినిమాలో తుకారం పాత్రధారి నాగేశ్వరరావు తన ఇష్టదైవాన్ని నిలదీశాడు. అదే సీను ఇప్పుడు దేశ ప్రజా జీవితంలో పునరావృతం కాబోతోంది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి అతి క్రూరమైన తుపాకీ ఫిరంగి గుండులకు తమ గుండెలు ఎదురొడ్డి ఎంతోమంది త్యాగధనులు సాధించి పెట్టిన "ప్రజాస్వామ్య విలువలు" నేడు మతోన్మాదంతో హారతి కర్పూరంలా కరిగిపోతుంటే భక్త తుకారం ఆక్రోసించినట్లు "ఉన్నావా... అసలున్నావా..." అని ప్రజాస్వామ్యం గురించి ఈ దేశ సగటు ప్రజలు గొంతెత్తి ఘోషించవలసిన తరుణం ఆసన్నమైనది. ఇంత కాలం సంఘ్‌పరివార్ శక్తులు, బీజేపీ హిందూ మతోన్మాదంతో భిన్నత్వంలో ఏకత్వం కలిగి వివిధ మతాలు, జాతులు గల ఈ దేశాన్ని రక్తపు టేరుల్లో ముంచెత్తే విధానాలను ప్రచారం జేస్తూ మైనార్టీలను వెంటాడుతున్నారు. ఈ దేశ ప్రజలు ఏం తినాలో, ఏ దైవాన్ని పూజించాలనో నిర్దేశిస్తూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఏం బట్టలు వేసుకోవాలో ఏ విధంగా పెళ్లిళ్లు చేసుకోవాలో ఆంక్షలుపెట్టి బలప్రయోగం అమలు చేస్తున్నారు.

ఇప్పుడు సాక్షాత్తు దేశ ప్రధాని బహిరంగంగానే హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టడంతో ఇన్నాళ్లూ వున్న మేలి ముసుగు తొలగిపోయింది. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకివస్తే ఈ దేశ సంపద తుదకు మహిళల మంగళసూత్రాలు మైనార్టీలకు పంచుతుందని రాజస్థాన్‌లో ఒక బహిరంగ సభలో ప్రధాన మంత్రి రెచ్చగొట్టారు. రెండు రాజకీయ పార్టీల సమస్యగా భావించడం సరికాదు. దేశ సంపద మైనార్టీలకు పంచుతారని చెప్పడం ద్వారా హిందూ మతోన్మాదాన్ని నిస్సిగ్గుగా రెచ్చ గొట్టడమే. విచారకరమైన అంశమేమంటే ఇంత దారుణంగా ప్రధాన మంత్రి ప్రసంగించినా ఇందులో ఇమిడి వున్న ప్రమాదం గురించి మీడియా అవసరమైన మేరకు స్పందించక పోవడమే. ఈ సందర్భంలో రెండు అంశాలు ఇమిడి వున్నాయి. ఎన్నికల కోడ్ చెలియల కట్టను ప్రధాన మంత్రి అతిక్రమించారని ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా ఆదేశాలు ఇస్తుందా? ప్రజాస్వామ్య వాదులమని చెప్పుకొనే అనేక పార్టీల నేతలు ఎవరు ఏ విధంగా స్పందించుతారో తేలవలసి ఉంది. అంతేకాదు. ప్రధాన మంత్రి కాంగ్రెస్ వాళ్లను అర్బన్ నక్సలైట్ల మనస్తత్వం గల వారుగా అభివర్ణించారు. వాస్తవంలో కాంగ్రెస్ నాయకులు అర్బన్ నక్సలైట్లుగా వుంటే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యేవారుకారు. ఈ దేశ తీరు తెన్నులు మరోలా వుండేటివి. రాజస్థాన్ ఎన్నికల సభలో కాంగ్రెస్ పార్టీ నేతలను అర్బన్ నక్సల్స్ గా చిత్రించడం వారి వరకే పరిమితం కాదు. ఇన్నాళ్లూ నక్సలైట్లకు సానుభూతి పరులుగా వున్నారని పరోక్షంగా సాయ పడుతున్నారని మేధావులను తదితరులను అర్బన్ నక్సల్స్‌గా ముద్రవేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేటాడుతూ వుంది. ప్రస్తుతం కాంగ్రెస్ వారినే ఆ జాబితాలో చేర్చితే ఇక వామపక్ష ప్రజాతంత్ర ప్రజాస్వామ్య శక్తులకు ఎట్టి మినహాయింపులు ప్రధాన మంత్రి డిక్షనరీలో వుంటాయా ? ఈ అంశంలో దేశంలోని ప్రజాస్వామ్యం శక్తులు ఉదాసీనత వహించితే నాజీ జర్మనీలో మత గురువు మార్టిన్ నీమోల్లర్ (1892-1984) కు పట్టిన దుర్గతి తప్పదేమో. ఆఖరున కాపాడేందుకు ఎవరూ ఎవరికి మిగలక పోవచ్చు.

2014 లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను అధ్యయనం చేసిన తర్వాత ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ జస్టిస్ మార్కండేయ కట్జూ లాంటి వారు తొలి ప్రపంచయుద్ధం తరువాత జర్మనీలో చోటు చేసుకున్న పరిణామాలాంటివి భారత దేశంలో కూడా మొదలైనాయని అనుమానించారు. ప్రజాస్వామ్య వాదులమని భావించే చాలామంది పార్టీల నేతలు చాలా లైట్ గా తీసుకున్నారు. తుదకు స్వామి అగ్నివేష్ లాంటి వారిని నడివీధిలో బట్టలు లాగి అవమానం చేసినా రావలసిన స్పందన రాలేదు. పూర్తి వికలాంగుడు ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వారు జైలు పాలైనా ఆయనకు అర్బన్ నక్సలైట్ ముద్ర వేశారు కాబట్టి వాదులమని చెప్పుకొనే ప్రజాస్వామ్య నేతలు మాట్లాడ లేదు. ఇప్పుడు సాక్షాత్తు ప్రధాన మంత్రే కాంగ్రెస్ నేతలను అర్బన్ నక్సల్స్‌గా అభివర్ణించారు కాబట్టి ప్రజాస్వామ్యం గురించి నిత్యం వల్లె వేసే వారి స్పందన ఏలా వుంటుందో చూడాలి. ఈ పరిణామాలు పరిశీలిస్తుంటే తొలి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీలో క్రమేణా చోటు చేసుకున్న అమానవీయ అప్రజాస్వామిక విధానాలే భారత దేశంలో ముమ్ముందు సంభవించనున్నాయి. జర్మనీలో తొలుత యూదులకు వ్యతిరేకంగా ప్రారంభమైన హింసాకాండ తదుపరి కార్మిక నాయకులు కమ్యూనిస్టులు అంతిమంగా మత పెద్దలను కూడా టార్గెట్ చేశారు. ఇంతింతైవటుడింతై అన్నట్లు జర్మనీలో హిట్లర్ నియంతగా పెరిగిన తీరులోనే దేశంలోనే కాదు బీజేపీలో కూడా నరేంద్ర మోదీ ఏకఛత్రాధిపతిగా తయారౌతున్నారు. బీజేపీలో సమిష్టి నాయకత్వం కొండెక్కి నరేంద్ర మోదీ ఇమేజ్ పైనే ఇప్పుడు ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. ఆనాడు జర్మనీలో సంక్షోభానికి యూదులే కారణమని తొలుత రెచ్చ గొట్టబడింది. వారి ఆస్తులు కొళ్ల గొట్టబడ్డాయి. లక్షలాదిమంది మృత్యువాత పడ్డారు. తర్వాత జర్మనైజేషన్ పేర ఏం జరగిందీ చరిత్ర పుటల్లో రక్తాక్షరాలతో లిఖించారు. అయితే భారతదేశంలో మైనార్టీలు టార్గెట్ అవుతున్నారు. జర్మనీలో చోటు చేసుకొన్నలాంటి హింసాకాండ భారతదేశంలో నెలకొనడానికి చాలాకాలం పడుతుందని భావిస్తుండగా సాక్షాత్తు ప్రధాన మంత్రి తన ప్రసంగం ద్వారా ఈ ముహూర్తం త్వరలో వుందనే సంకేతాలు ఇచ్చారు.

సెల్: 9848394013

హిందూ రాష్ట్ర ఏర్పాటు కుట్ర

డి. రాజా,
సీపీఐ ప్రధాన కార్యదర్శి

మన దేశానికి అత్యంత కీలకమైన సందర్భంలో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. మన రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మనుగడను మన దేశం ఏ విధంగా నిర్ణయిస్తుందన్న దానిపై ఎంతో ఆధారపడి ఉంది. పాలక బీజేపీ సాధ్యమైన అన్ని మార్గాల ద్వారా వాగాడంబరం, బోలు వాగ్దానాలను ప్రజలపై కుమ్మరిస్తున్నది. డబ్బు చేస్తున్న ఈ గోలలో అత్యంత ముఖ్యమైన అంశాలు చర్చకేరావు. గడచిన 10 సంవత్సరాల్లో అందిన సూచనల మేరకు అధికారంలో బీజేపీ కొనసాగటం మన రాజ్యాంగంలో పొందుపరిచిన ఉమ్మడి సంక్షేమం, సమానత్వం, లౌకికతత్వం వంటి విలువలకు మరణ శాసనమే. ఆర్థికవ్యవస్థ నిర్వహణలో మోదీ ప్రభుత్వానిది ఘోర వైఫల్యం. ఆర్ఎస్ఎస్ ప్రోత్సహించిన ద్వేషం వల్ల మన సమాజానికి జరిగిన చేటుకూడా కనీవినీ ఎరుగనిది. గొప్ప విలువలపై నిర్మించిన ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టం కూడా అపారం. దైవదూతలాంటి మోదీ నాయకత్వంలో భారతదేశం సూపర్ పవర్ అయిందని ప్రచారం చేయటానికి దూడూ బసవన్నలుగా ప్రెస్, రాజీపడిన సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలను మనం ప్రజల దృష్టినుండి, ముఖ్యంగా అణగారిన తరగతులనుండి, బీజేపీ పాలనలో ఆకలి, నిరుద్యోగం వంటి అతితీవ్రమైన సమస్యలను చూడాలి.

ప్రస్తుత రాజకీయ వాతావరణం 'మోదీ పచ్చి అబద్ధాలు, గ్యారెంటీలు' అనే పదబంధంతో నిండిఉంది. గతంలో ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించటానికి సార్వత్రిక ఎన్నికలు ఒక సందర్భం. మోదీ గ్యారంటీలు ఓటు బ్యాంక్ రాజకీయాలు - పచ్చి అబద్ధాల మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు ప్రజలు చూస్తున్నారు. మోదీ 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు - 2కోట్ల ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు, మహిళలకు భద్రత, ప్రతి కుటుంబ బ్యాంక్ ఖాతాలోకి రూ.15లక్షలు జమ వంటి సమస్యల గూర్చి బీజేపీ నాయకులు ఇప్పుడు కనీసం చర్చించటం కూడా లేదు. జవాబుదారీ తనంలేని నాయకుని ఇష్టానుసారం ప్రకటించిన పెద్దనోట్లరద్దు వంటి 'మాస్టర్ స్ట్రోక్' అనేది దృష్టి మళ్లింపు ఎత్తుగడ. ఈనాడు దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలనుండి దృష్టి మరల్చటానికి ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రచార వ్యవస్థ చేస్తున్న ప్రయత్నం సంభ్రమం గొలుపుతోంది. బీజేపీ ప్రజలకు సేవచేసే బదులు వారిని దోచుకోవటంలో మునిగి ఉంది. మోదీ దుష్పరిపాలనలో ప్రజలు బాధలు పడుతుండగా, ఆయన అందరికీ సౌభాగ్యం అనే తన వాగ్దానాలను తిరిగి విక్రయించే పనిలో ఉన్నారు. ఇదంతా 'వికసిత్ భారత్' అనే తెర వెనుక ఉంది. భారత్‌లో వాస్తవిక భాగస్వాములైన కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు ఒక దశాబ్దంపాటు అవకాశాలు కోల్పోయినందుకు విచారిస్తున్నారు.

ప్రధానమంత్రి మోదీ, ఆయన వందిమాగధులు ఐదు ట్రిలియన్ డాలర్ ఆర్థికవ్యవస్థ అనే బోలు వాగ్దానాన్ని ఖాళీ డబ్బాలో గులకరాయిలా గలగలలాడిస్తున్నారు. ఆ ఆర్థిక వ్యవస్థరూపం, స్వభావం గూర్చి వారెన్నడూ చర్చించరు. వామపక్షం బలపరిచిన యూపీఏ మొదటి ప్రభుత్వంలో

సామాజిక భద్రత పథకాలు పెద్ద ఎత్తున విస్తరించటాన్ని భారతదేశం చూసింది. అవి జనాభాలోని అన్ని తరగతులకు లబ్ధి చేకూర్చాయి. రాజ్యాంగం కింద లభ్యమయ్యే హక్కుల పరిధిని ఇతోధికంగా విస్తృతపరిచాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 2005, కింద పనిహక్కు, సమాచార హక్కుచట్టం, 2005, కింద ప్రభుత్వ చర్యలను తెలుసుకునే హక్కు, షెడ్యూల్డు తెగలు, ఇతర సాంప్రదాయక అటవీ నివాసితులు చట్టం (అటవీ హక్కుల గుర్తింపు) 2006, కింద అడవులపై గిరిజనులకు హక్కు కల్పించటం, విద్యాహక్కు చట్టం, 2009, కింద ఉచిత, నిర్బంధ విద్యకు హక్కు కల్పించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని అమలు చేయటం వాటిలో ఉన్నాయి. ఈ పథకాలు ప్రతి గృహాన్ని చేరాయి.

అధిక వాగాడంబరం ప్రదర్శిస్తున్న మోదీ ప్రభుత్వం ఈ కీలకమైన హక్కుల పరిధిని విస్తరించకుండా తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. మోదీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వేతనాలను గణనీయంగా పెంచలేదు. పనిదినాల పెంపుదల, వేతనాల పెంపు డిమాండ్లు చెవులకెక్కలేదు. సమాచార హక్కు చట్టం పెద్ద ఎదురుదెబ్బలకు గురైంది. ప్రభుత్వ జవాబు దారీతనానికి సంబంధించిన ఇబ్బందికరమైన సమాచారం వెల్లడించకుండా ముఖ్య సమాచార అధికారి హోదాను కుదించారు. గిరిజనుల వనరులను కార్పొరేట్ దోపిడీకి అప్పగించారు. కార్పొరేట్ లాబీయింగ్ కారణంగా దట్టమైన అడవుల్లో మైనింగ్ అనుమతించారు. గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన అన్ని నియమ నిబంధనలను తుంగలో తొక్కారు. విద్యాహక్కు పరిధిని విస్తరించలేదు. దాని పరిధి కింద 14-18 వయో గ్రూపును పెంచాలని డిమాండ్ కొనసాగుతున్నది. భారీగా పెరుగుతున్న విద్య ప్రైవేటీకరణ, ప్రభుత్వ విద్యపట్ల నిర్లక్ష్యం, పాఠ్య ప్రణాళికలో హేతురహితమైన మార్పులు వాటిన్నింటినీ కలిపిచూచినపుడు మన భావితరాలు వినాశకర పర్యవసనాలకు గురికానున్నాయి. 14-18 వయో గ్రూపులోని గ్రామీణ బాలల్లో అత్యధికులు 3వ తరగతి లెక్కలు చేయలేకపోతున్నారని, 25 శాతం మందికి పైగా చదవలేకపోతున్నారని విద్య ప్రతిపత్తిపై వార్షిక నివేదిక తెలుపుతున్నది. మోదీ ప్రభుత్వం మన దేశ భవిష్యత్‌ను బలిపెడుతూ కార్పొరేట్లకు ప్రాధాన్యత ఇస్తున్నది. అది మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రజల పునాదులపై దెబ్బ తర్వాత దెబ్బ కొడుతున్నది. నిరుద్యోగం గత 45 సంవత్సరాల్లో ఎన్నడూలేనంత స్థాయికి చేరింది. బీజేపీగాని లేదా ప్రధానమంత్రిగానీ దీనిగూర్చి నోరు మెదపరు. నిరుద్యోగుల్లో 83 శాతం యువత అని భారతదేశంపై ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ ఒ) నివేదిక తెలిపింది. బీజేపీ తమ దుష్పరిపాలనవల్ల ఒక తరం ఆకాంక్షలను కాలికింద నలిపివేసింది. మతాన్ని ఉపయోగించి యువతను తప్పుదారి పట్టించటం కొనసాగిస్తున్నది. బీజేపీ పరిపాలనలో వంటగ్యాస్ ధర రెట్టింపునకు పైగా పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) సామాన్య ప్రజల జీవితాలను కఠినతరం చేస్తున్నది. మన శ్రమజీవుల్లో అత్యధికుల నిజవేతనాలు నిశ్చలంగా ఉన్నాయి. కాగా బీజేపీ రామమందిరం, సీఏఏ వంటి అంశాలపై విభజన తేవటంపై కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. బీజేపీ అంతటి అవినీతి పార్టీ మరొకదాన్ని స్వతంత్ర భారతదేశం చూడలేదని రాజ్యాంగవిరుద్ధమైన ఎన్నికల బాండ్ల పథకం రుజువుచేసింది. రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసిన, వ్యవస్థీకృతం చేసిన ప్రధానమంత్రిగా మోదీ చరిత్రలో మిగిలిపోతారు. కార్పొరేట్లతో మోదీ అవినీతి వ్యవహారాలు, క్విడ్ ప్రోకో చర్యలు దేశంలో ఎటువంటి పరిస్థితిని సృష్టించాయంటే, దేశ యావత్ సంపదలో మన జనాభాలో అగ్రస్థానంలో ఉన్న 1 శాతం భారతీయుల వాటా బ్రిటీష్ పాలన కాలంలో కన్నా హెచ్చుగా ఉంది. ఈ నూతన గ్యారంటీలు మోదీ కొత్తగా సమానత్వ బోలుతనంతో కూర్చిన పదబంధం 'అమృత్ కాల్' అనే చెత్తబుట్ట చేరటం ఖాయం. మోదీ ఎన్నికల విజయాలకు ప్రాతిపదిక మతం, కుల మార్గాల్లో ప్రజలను విభజించటం. బీజేపీ యేతర రాజకీయ పార్టీల మధ్య కృత్రిమమైన విభేదాలు సృష్టించటం, మీడియాను నియంత్రించటం, స్వేచ్ఛగా సమాచార ప్రసారాన్ని నిలుపుచేయటం, ఎన్నికల బాండ్లనుంచి డబ్బు పోగుచేసుకోవటం, విమర్శించే గొంతుకలను అణచివేస్తున్నారు. నిరంకుశ చట్టాలతో, ఇ.డి. సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయటం ద్వారా బెదిరింపులకు గురిచేయటం. మన రాజ్యాంగానికి, అందులో పొందుపరిచిన ఆదర్శాలకు ఆర్ఎస్ఎస్ వారి హిందూత్వ భావన నుండి ఎదురవుతున్న ప్రత్యక్ష ప్రమాదం భవిష్యత్ ఈ ఎన్నికల్లో ఫలితాలపై ఆధారపడి ఉంటుంది.

లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్ పునాదులను మనం కాపాడుకోవాలంటే, ఆర్ఎస్ఎస్ బీజేపీలను, వాటి ఏహ్యకరమైన హిందూత్వ భావజాలాన్ని తప్పక ఓడించాలి. డాక్టర్ అంబేద్కర్ ఎప్పుడు హెచ్చరించినట్లుగా ప్రజాస్వామ్యవాదులందరి చెవుల్లో గణగణ హెచ్చరిక గంటలు మోగించాలి. రాజ్యాంగ నిర్ణాయక సభలో ఆయన ఇలా చెప్పారు : "హిందూ రాజ్యం వాస్తవికమైనట్లయితే, అది నిస్సందేహంగా ఈ దేశానికి అతి పెద్ద అవరోధం. అది ప్రజాస్వామ్యంతో పొసగదు. ఏ మూల్యమైనా చెల్లించుకుని హిందూరాజ్య స్థాపనను నిరోధించాలి". మన దేశంలోని లౌకిక ప్రజాతంత్ర శక్తులందరి ముందున్న ప్రశ్న - ఎంతటి శ్రమదమాదులకోర్చి అయినా మన స్వాతంత్ర్యోద్యమ వారసత్వాన్ని కాపాడుకోవటానికి మనం సిద్ధంగా ఉన్నామా? బ్రిటిష్‌రాజ్ నుండి మన దేశ విముక్తికి మనదేశ పురుషులు, స్త్రీలు, మత, కుల, భాష, ప్రాంతం విభజనను అధిగమించి ఐక్యంగా పోరాడారు. మన దేశాన్ని, దాని భవిష్యత్‌ను రక్షించుకునేందుకు ఆర్ఎస్ఎస్-బీజేపీ రాజ్యాన్ని ఐక్యంగా ఓడించాల్సిన సమయం ఆసన్నమైంది.

కమల వికాసం కలే...!



డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి

బీజేపీ నేతల కాళ్ల కింద నేల కదులుతోంది. భారతదేశంలో కొనసాగుతున్న పోలింగ్‌లో తొలి దశ ఆ పార్టీకి ఎక్కడా అనుకూలించలేదు. ఈ పరిణామం మోదీ పరివారానికి ఎంత మాత్రమూ రుచించడం లేదనే విషయం గత రెండు మూడు రోజులుగా మోదీ ప్రచార సరళిలోనే వ్యక్తమవుతున్నది. పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్న ఉత్తర భారతదేశంలోనే ఎదురుగాలి వీచినట్టు స్పష్టంగా కనిపించింది. జనం నాడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ పెట్టుకున్న ఆశలకు భిన్నంగా ఉందనే అసలు వాస్తవం బహిర్గతమైంది. నిజానికి ఉత్తర భారతంలో గత ఎన్నికల్లోనే బీజేపీ గెలవగలిగినన్ని స్థానాలను గెలుచుకున్నది. ఇక అక్కడ ఒక్క స్థానం కూడా అదనంగా ఆ పార్టీకి లేదా వారి కూటమి పార్టీలకు దక్కే అవకాశమే లేదనే రాజకీయ విశ్లేషణలు ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందే గట్టిగానే వినిపించాయి. ఈ నేపథ్యంలోనే బీజేపీ వెన్నులోవణుకు మొదలైంది. తమలోని ఈ ఆత్మన్యూనతను బయటకు రాకుండా మోదీ పరివారం మొత్తం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించింది. అందులో భాగంగా 2024 ఎన్నికల్లో తమకే 370 సీట్లు వస్తాయని, తమ మొత్తం కూటమి 400 స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆకాశానికి నిచ్చెనవేసే తరహా ఒక ప్రచార ఆర్భాటానికి తెరలేపింది. తమలోని భయాన్ని కప్పిపుచ్చుకోవడం, తమ కార్యకర్తలు కాడి వదిలేయకుండా చూసుకోవడం, ప్రతి పక్షాలను జడిపించడం వంటి లక్ష్యాలతో మాటకారితనంలో తనకెవరూ సాటిరాని మోదీ ఓ విఫల ప్రయోగం చేశారు. జనం మెదళ్ళను తమకు అనుకూలంగా మార్చుతుందనే నమ్మకం పటాపంచలైనట్టు తొలిదశ పోలింగ్ బహిర్గతంచేసింది.

ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మోదీ రాజస్థాన్ పర్యటనను ఎన్నికల ప్రచార వేదికగా మార్చుకున్నారు. దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పేదరికం, ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, ధరలమంట తదితర కీలకమైన సమస్యలు ఏవీ తెరపైకి రాకుండా మరోసారి తమదే అధికారమని గొప్పలకు పోయారు. మరింత ముందుకెళ్లి వివిధ దేశాలకు చెందిన అధినేతలు కూడా తన గెలుపును గ్రహించే ముందుగానే తమ దేశానికి రావాలంటూ ఆహ్వానాలు పంపుతున్నారంటూ ఒక రకంగా అతి చేశారు. తమకు 370, తమ కూటమికి 400 పైగా స్థానాలు అని మోదీ నోట వచ్చిన వెంటనే ఇదేమి సాధ్యం కాదనే రీతిలో విశ్లేషణలు అనేక కోణాల్లో వివరాలతో, క్షేత్రస్థాయి నివేదిక ఆధారంగా బయటకు వచ్చాయి. ఏ రాష్ట్రంలో ఏ పరిస్థితి ఉంది. మోదీ మానియా, వాగాడంబర నినాదాలతో ఒరిగేదేమీ లేదని, ఇకపై ఆ జిమ్మిక్కులేవీ ఓట్లు రాల్చవని అందుకు గల కారణాలు సోషల్ మీడియాలో బాగా ప్రచారమయ్యాయి. అప్పటికి ఉన్న పరిస్థితుల నేపధ్యంలో బీజేపీకి సొంతంగా 210 సీట్లు కూడా వచ్చే స్థితి కూడా కనిపించడం లేదని లాజికల్‌గా అన్ని వివరణలతో అనేక వ్యాసాలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. జనం మెదళ్లను బాగా కదిలించాయి. ఏమి సాధించారని 370 అంటున్నారనే ప్రశ్న జనంనోళ్లలో బాగా వ్యాప్తిలోకి వచ్చింది.

ఎంత జనం దృష్టి మళ్లించాలనిచూస్తే తమ పట్ల అంతకు రెండింతలు ఆగ్రహం పెరుగుతోందని గ్రహించిన మోదీ పరివార శక్తులు తమకు వెన్నతో పెట్టిన విద్య అయిన మతతత్వ ఎజెండాను మరోసారి తెరపైకి తెచ్చాయి. రామ మందిర నిర్మాణం, ఉచిత అయోధ్య దర్శనం అని ఎన్నికల నిబంధనలు



వ్యతిరేకంగా అమిత్ షా మొదలు పెడితే బీజేపీ నేతలంతా అందుకున్నారు. తమ వల్లనే భారతదేశంలో అచ్చేదిన్ దాటుకుని, అమృత కాలాన్ని కూడా దాటవేసి ఇక వికసిత్ భారత్‌గా మారుతున్నదని గొప్పలకుపోయి ప్రచారం మొదలు పెట్టారు. ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయడంలో తొలి అంకంగా నితీష్ కుమార్‌ను బయటకు లాగేసినా వారనుకున్నది జరుగకపోగా ఆ కూటమి మరింత బలపడింది. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎన్‌డీఏ కూటమికి కొరకరాని కొయ్యగా మారారు. తామెన్ని కుట్రలు చేసినా ఎంత బెదిరించినా, ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయలేకపోయామనే అక్కసు, ఓటమి తప్పదని గ్రహించి అరవింద్ కేజ్రీవాల్‌ను జైలు గోడలమధ్యకు నెట్టి తాము అనుకున్నది సాధించాలని భావించారు. ఈ ఎత్తుగడ కూడా అడ్డం తిరిగింది. అప్పటికే ఆమ్ ఆద్మీపార్టీ ఢిల్లీ, హర్యానా, గుజరాత్ సహా వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో సర్దుబాటు చేసుకోవడంతో కేజ్రీవాల్ అరెస్టు కూటమిని మరింత బలంగా మార్చేందుకే ఉపయుక్తమైంది. కేజ్రీవాల్ ను జైలుపాలు చేస్తే మిగతావారిని భయ పెట్టవచ్చు అనుకున్నా అది జరుగక బీజేపీ చతికిలపడింది.

ఈ తరుణంలోనే అప్పటికి పెద్దగా గుర్తింపులేని యూ ట్యూబర్ ధ్రువ్ రాఠీ భారత్ నియంతృత్వం దిశగా కదులుతోందనే సందేశంతో నెట్టింట పెట్టిన ఒక వీడియో అమాంతంగా ఉత్తర భారతదేశాన్ని ఆవహించింది. అందులోని సారాంశం మోదీ పాలనలో కొనసాగుతున్న నియంతృత్వంపై చాలా ఉదాహరణలతో ఆకట్టుకునే వ్యాఖ్యానం ఉండడంతో జనం మదిలోతుల్లోకి చేరింది. ఉత్తరాదిన కొద్ది రోజుల్లోనే ఆ యూట్యూబర్‌కు కోట్లమంది మద్దతు లభించింది. మోదీ వ్యతిరేకతను మరింతగా పెంచడంలో ధ్రువ్‌రాఠీ చేసిన వీడియో పాత్ర కీలకంగానూ మారింది. క్రమంగా దేశమంతా విస్తరించింది. హిందీ నుంచి తమిళం, తెలుగు, మరాఠీ, బెంగాల్ సహా వివిధ భాషల్లోకి తర్జుమాచేసి ఆ వీడియోను ధ్రువ్‌రాఠీ మరోసారి విడుదల చేయడంతో సోషల్ మీడియా షేక్ అయ్యింది. గతంలో తమకు అనుకూలంగా మారిన సోషల్ మీడియా క్రమంగా ఎదురు తిరగడం మొదలైంది. స్థానిక భాషల్లోకి విడుదలైన కొద్ది గంటల్లోనే లక్షల మంది ధ్రువ్ రాఠీ విడుదల చేసిన సదరు వీడియోను అక్కున చేర్చుకున్నారంటే మోదీ పట్ల తమలో ఉన్న వ్యతిరేకతను జనం ఆ రకంగా వెలిబుచ్చారని అర్థం చేసుకోవచ్చు. ఈ ఫలితాలు తొలి దశలోనే బయటపడ్డాయి. గతంలో తాము పొందిన సీట్ల నుంచే సుమారు 25 సీట్లు కోల్పోవాల్సి వస్తున్నదని మోదీకి అర్థమైంది. తాను చాలాసార్లు పర్యటించడం ద్వారా, దేవాలయాలను దర్శించుకోవడం ద్వారా తమిళనాడులో గెలుస్తాడని ఆశలు పెట్టుకున్న అన్నామలై కూడా ఓట్లు రాల్చుకోవడంలో చతికిల పడ్డారని గ్రహించారు. కేరళలో ఎలాగూ ఉండదని ముందే తెలిసినా, పట్టు నిలుపుకోవాలని పరితపించిన కర్నాటకలోనూ గతంలోని 26 స్థానాల్లో 15 స్థానాలకు పైనే చేజారిపోతున్న క్రమం కళ్లముందు సాక్షాత్కారమైంది. ఉత్తరాదిలో బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో వీస్తున్న ఎదురుగాలి గట్టిగానే తగిలినట్టు తెలుసుకున్నారు.

ఈ నేపథ్యంలోనే తొలి దశ పోలింగ్ ముగిసిన వెంటనే నాగ్‌పూర్‌కు వెళ్లి ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంలో ఒక రాత్రి గడిపారు. అక్కడి నుంచి అందుకున్న ఆదేశాలతో తనలో నిక్షిప్తమైన మతతత్వ విషాన్ని ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా సమాజంపై చిమ్మడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే హిందువుల ఆస్తులను కైవశం చేసుకుని కాంగ్రెస్ పార్టీ వాటిని ముస్లింలకు, మైనారిటీలకు పంచుతుందని వ్యాఖ్యలతో మతతత్వ బుసలు కొట్టారు. ప్రధానిగా ఉండి ఇంత దారుణంగా కమ్యూనల్ ఎజెండాను తెరపైకి తేవడానికి వెనుకాడక పోవడం వెనుక ఓటమి కళ్లకు కనిపిస్తుండడమే. కన్నడ అసెంబ్లీ ఎన్నికల తరుణంలో ఓటమి కనిపించే జై భజరంగ భళీ అంటూ బీజేపీకి ఓటు వేయమన్నారు. ఆయన వేస్తున్నవి ఎత్తుగడలు కావు. ఓటమి కళ్లముందున్న తరుణంలో దింపుడు కళ్లెం ఆశలతో కమ్యూనల్ అజెండాను తెస్తున్నారు. ఆయన ఎన్ని ప్రయత్నాలు చేసినా జనసామాన్యానికి తాము పడుతున్న కష్టాలకు కారణం మోదీ ప్రభుత్వమే అని నిర్ధారించుకున్నారు. కాబట్టే తొలి దశలోనే గట్టి షాక్ ఇచ్చారు. రానున్న అన్ని దశల్లో ఈ తరహా షాక్ ట్రీట్‌మెంటు ఇచ్చి బీజేపీని సాగనంపుతారు కాబట్టి కమలం వికసించడం కల్లే.

సెల్: 9059837847

ఎంపీ, ఎమ్మెల్యేల కేసుల్లో మందకొడి తీర్పులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల పరిష్కారం మందకొడిగా సాగుతోంది. వీటి కోసం ఏర్పాటైన ప్రత్యేక కోర్టులు గత ఏడాది 2,018 కేసుల్లో తీర్పులు వెలువరించాయి. ఈ విషయం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడయింది. ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించేలా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది అశ్విన్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిల్‌పై విచారణ సందర్భంగా అమికస్‌క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా ఈ అఫిడవిట్ సుప్రీంకోర్టుకు సమర్పించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కూడా క్రిమినల్ కేసులు ఉన్నవారు రంగంలో ఉన్నందున కేసుల సత్వర విచారణపై దృష్టి పెట్టాల్సి ఉందని తెలిపారు. మొదటి రెండు దశల ఎన్నికల్లో 2,810 మంది పోటీ చేస్తుండగా అందులో 501 మంది (18 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. వీరిలో 327 మంది (12 శాతం)పై అయిదేళ్ల కన్నా ఎక్కువకాలం పాటు శిక్షలు పడే తీవ్రమైన కేసులు ఉన్నాయని వివరించారు. క్రిమినల్ కేసులు ఉన్నవారు గణనీయ సంఖ్యలోనే ఎన్నికవుతున్నందున కేసుల సత్వర పరిష్కారానికి మరిన్ని ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని అఫిడవిట్‌లో సూచించారు. 2023 జనవరి ఒకటో తేదీ నాటికి మొత్తం 4,697 కేసులు పెండింగ్‌లో ఉండగా ఆ ఏడాది మొత్తం మీద ప్రత్యేక కోర్టులు 2,018 కేసులు పరిష్కరించాయి. కొత్తగా 1,746 కేసులు రావడంతో పెండింగ్ కేసుల సంఖ్య మళ్లీ 4,474కు పెరిగింది. మొత్తం 1,300 కేసుల్లో 766 కేసులు పరిష్కరించి ఉత్తరప్రదేశ్‌లోని కోర్టులు సంఖ్యాపరగా మొదటి స్థానంలో ఉన్నాయి. కేసుల పరిష్కారంపై హైకోర్టులు మరింత నిశితంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని అమికస్ క్యూరీ హన్సారియా తన అఫిడవిట్‌లో సూచించారు. మూడేళ్ల కంటే ఎక్కువకాలంపాటు కేసులు పెండింగ్‌లో ఉంటే అందుకుగల కారణాలు వివరిస్తూ ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుల జడ్జీల నుంచి హైకోర్టులు నివేదిక కోరాల్సి ఉంటుందని సిఫార్సు చేశారు.

హైకోర్టులు ప్రతి కేసును సూక్ష్మస్థాయిలో పరిశీలించి విచారణ త్వరగా పూర్తయ్యేలా సూచనలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కేసుల కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించేలా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసులపై తెలంగాణ, అలహాబాద్, దిల్లీ, పంజాబ్-హర్యానా, త్రిపుర హైకోర్టులు సూక్ష్మస్థాయి పరిశీలన జరిపి దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నాయని హన్సారియా తెలిపారు. తగిన ఉత్తర్వులు ఇచ్చాయని పేర్కొన్నారు. మిగిలిన హైకోర్టులు మాత్రం పెండింగ్ కేసుల సమాచారాన్ని తెలుసుకున్నాయని వివరించారు.

మళ్లీ శశిథరూర్‌దే విజయం: ప్రకాశ్‌రాజ్

తిరువనంతపురం: దేశంలో ఎన్నికల పోరు జోరుగా సాగుతున్న తరుణంలో సీనియర్ నేతలు సైతం నువ్వా... నేనా అన్నట్లు తలపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ ... తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకుడు 'శశిథరూర్' మళ్లీ విజయం సాధిస్తారని అన్నారు. శశిథరూర్ నా స్నేహితుడు, గొప్ప నాయకుడు. అందుకే అతడికి అండగా నిలబడటానికి నేను వచ్చానని ప్రకాశ్‌రాజ్ అన్నారు. ప్రస్తుతం ఆయన కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) నాయకుడు పన్నియన్ రవీంద్రన్‌లను ఎదుర్కొని పోటీకి నిలబడుతున్నారని అన్నారు. 2009 నుంచి గెలుస్తున్న శశి థరూర్‌కు వ్యతిరేకంగా బీజేపీ బలమైన నాయకుడిని బరిలోకి దింపింది. కాబట్టి ఈ సారి జరగబోయే ఎన్నికలు మరింత ఆసక్తికరంగా ఉంటాయి. 20 ఎంపీ స్థానాలకు కేరళ రాష్ట్రంలో 2019లో 19 స్థానాలను కాంగ్రెస్ సొంతం చేసుకోగా.. ఒక స్థానంలో సీపీఎం గెలుపొందింది. బీజేపీ విఫలమైంది. 2016లో ఒక్కసారి మాత్రమే బీజేపీ నెమోమ్ అసెంబ్లీ స్థానంలో గెలిచింది. అయితే ఇప్పటివరకు బీజేపీ ఎంపీ స్థానాన్ని గెలుచుకోలేదు. కాగా కేరళలో లోక్‌సభ నియోజకవర్గాలకు ఈనెల 26న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. జూన్ నాలుగున కౌంటింగ్ జరగనుంది.

కాంగ్రెస్ రహిత భారత్ అవసరం: కేశవ్ ప్రసాద్ మౌర్య

లక్నో: కాంగ్రెస్ హయాంలో విధ్వంస పాలన జరిగిందని యూపీ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఆరోపించారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే మైనార్టీల సంతుష్టీకరణ జరుగుతుందని బెదిరించారు. అందుకే కాంగ్రెస్ రహిత భారత్ అవసరమని, ఎస్పీ, బీఎస్పీ రహిత యూపీని ఆవిష్కరించాలని కేశవ్ ప్రసాద్ మౌర్య పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్ నేతల తప్పుడు పనులను ప్రధాని మోదీ వెల్లడించడంతో వారు అసహనానికి గురవుతున్నారని చెప్పారు. కన్నౌజ్ లోక్‌సభ స్థానం నుంచి తేజ్ ప్రతాప్ యాదవ్ పేరును ఎస్పీ వెల్లడించడంతో ఒకే కుటుంబం నుంచి ఐదుగురు వ్యక్తులు లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచారని, బంధుప్రీతి, కుటుంబ రాజకీయాల ఒరవడి ఆ పార్టీలో స్పష్టంగా వెల్లడవుతోందని మౌర్య అన్నారు. ఓటమి భయంతో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో 80 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని మౌర్య ధీమా వ్యక్తం చేశారు.

సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి అదృశ్యం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభానీ కనిపించడం లేదు. ఆయన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడంతో బీజేపీ అభ్యర్థి ముఖేశ్ దలాల్ ఏకగ్రీవంగా గెలుపొందారు. నీలేశ్ కుంభానీ కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులో లేడని, ఆయన ఇంటికి తాళం వేసి ఉన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే కుంభానీ త్వరలో బీజేపీలో చేరనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యకర్తలు, ఆయన ఇంటి ముందు నిరసన చేపట్టారు. ఇంటి గోడలపై 'ప్రజల ద్రోహి' అంటూ పోస్టర్లు అంటించారు. అయితే గుజరాత్‌లో అధికార బీజేపీ తప్పుడు ప్రభావం చూపిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. సూరత్‌లో ఎన్నికలు వాయిదా వేయాలని, అలాగే ఎన్నికల ప్రక్రియను మళ్లీ నిర్వహించాలని కోరినట్లు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ పేర్కొన్నారు. సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కుంభానీ అభ్యర్థిత్వాన్ని నలుగురు ప్రతిపాదకులు నామినేట్ చేశారని, అయినా... అకస్మాత్తుగా నలుగురు తమ సంతకాలు తిరస్కరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇది యాదృచ్ఛికం కాదని, అభ్యర్థి చాలా సమయం నుంచి కనిపించడం లేదని ఆరోపించారు. సూరత్‌లో కాంగ్రెస్ తరపున నీలేశ్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాలు సరిపోలడం లేదని ఆయన నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. అంతేగాక నీలేశ్‌కు ప్రత్యామ్నాయంగా సురేశ్ పడ్సాలాతోనూ కాంగ్రెస్ పార్టీ నామినేషన్ వేయించినప్పటికీ అది కూడా ఇతర కారణాలతో తిరస్కరణకు గురైంది. ఇదే స్థానం నుంచి పోటీకి దిగిన మిగతా ఎనిమిది మంది సైతం తమ నామినేషన్లు చివరి రోజైన సోమవారం ఉపసంహరించుకున్నారు. దీంతో ముకేశ్ దలాల్ ఒక్కరే పోటీలో నిలవడంతో ఆయన ఏకగ్రీవంగా గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

తృణమూల్ అద్భుత విజయం ఖాయం

నామినేషన్ దాఖలు చేసిన శత్రుఘ్నసిన్హా

అసంసోల్: బాలీవుడ్ నటుడు, సీనియర్ నేత శత్రుఘ్న సిన్హా అసాంసోల్ లోక్‌సభ నుంచి తృణమూల్ తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రజలు సరికొత్త రికార్డు స్థాయి విజయాన్ని తృణమూల్‌కి అందించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓటర్లు ప్రధాని నరేంద్ర మోదీకి గట్టి సమాధానం చెప్పనున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఏదో కాకతాళీయంగా కాకుండా అభ్యంతకరమైన భాష వాడుతున్నారని, గతంలోనూ 'దీదీ, ఓ దీదీ' అంటూ సీఎంను పరిహసిస్తూ మాట్లాడారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు అందుకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈసారి కూడా బెంగాల్ ప్రజలు గత రికార్డులను తిరగరాస్తూ ఘన విజయం అందించడం, మోదీకి గుణపాఠం చెప్పడం ఖాయమని సిన్హా చెప్పారు. మమతా బెనర్జీ చేసిన అభివృద్ధి పనులే తృణమూల్‌కి ఘన విజయాన్ని కట్టబెడతాయని చెప్పారు. టీఎంసీ రోడ్డుషోలకు వస్తున్న స్పందన, ప్రజలు చూపిస్తున్న ప్రేమ అసాధారణంగా ఉందన్నారు. మమతాబెనర్జీ, టీఎంసీ గెలుపు ఖాయమని అన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు మమతా బెనర్జీ చేసిన సేవలు, అభివృద్ధి పనులు ఏ సీఎం చేయలేదన్నారు. 42 లోక్‌సభ స్థానాలున్న పశ్చిమబెంగాల్‌లో మొత్తం ఏడు దశల్లో పోలింగ్ జరుగుతోంది. ఏప్రిల్ 19న తొలివిడత పోలింగ్ పూర్తికాగా, మలివిడతలుగా ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1న పోలింగ్ జరుగనుంది.

కార్పొరేటర్‌కు సిద్ధరామయ్య 'సారీ'

బెంగళూరు: కాంగ్రెస్ కార్పొరేటర్ నిరంజన్ హిరెమత్‌కు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య క్షమాపణలు చెప్పారు. ఇటీవల నిరంజన్ కూతురు నేహా దారుణ హత్యకు గురైంది. హత్య తర్వాత కార్పొరేటర్ నిరంజన్ ఇంటికి మంత్రి హెచ్ కే పాటిల్ వెళ్లారు. ఘటనపై సీఎం సిద్ధరామయ్య సారీ చెప్పారని తెలిపారు. ఈ విపత్కర సమయంలో తాము అండగా నిలుస్తామని వివరించారు. 'నేహాను హతమార్చిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం సిద్ధరామయ్య భరోసా ఇచ్చారు. ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సీఐడీ) విచారిస్తోంది. కేసు విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తాం' అని మంత్రి పాటిల్...నిరంజన్ కుటుంబ సభ్యులకు వివరించారు. కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించడం, ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో సీఎం సిద్ధరామయ్యకు నిరంజన్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కాగా, నిరంజన్ కూతురు నేహా హుబ్లీలో గల బీవీబీ కాలేజీలో ఎంసీఏ చదువుతోంది. అంతకుముందు ఫయాజ్ అనే వ్యక్తితో పరిచయం ఉంది. దానిని అతడు ఆసరాగా తీసుకున్నాడు. ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని నేహాపై ఒత్తిడి తీసుకొచ్చాడు. అందుకు నేహా అంగీకరించలేదు. దీంతో ఆమెను మట్టుబెట్టాలనే కఠిన నిర్ణయం తీసుకున్నాడు. ఈ నెల 18వ తేదీన క్యాంపస్‌లో ఉన్న నేహాపై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. నేహా చనిపోయిందని వైద్యులు ధృవీకరించారు. నేహాను హత్య చేసిన ఫయాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

విస్తరిస్తున్న హిమాలయ సరస్సులు

ఇస్రో నివేదిక వెల్లడి

బెంగళూరు: భూతాపం వల్ల హిమాలయాల్లో మంచు పర్వతాలు కరిగి ఏర్పడుతున్న సరస్సులు మరింత విస్తరిస్తున్నాయని ఇస్రో తాజాగా వెల్లడించింది. 2016-17లో గుర్తించిన 2,431 సరస్సుల్లో 89 శాతం సరస్సులు పెద్ద ఎత్తున విస్తరించాయని ఇస్రో నివేదిక తెలిపింది. వీటి పరిమాణం గత 38 ఏళ్లలో రెట్టింపు అయిందని ఇస్రో పేర్కొన్నది. 'శాటిలైట్ ఇన్‌సైట్స్... భారత హిమాలయాల్లో విస్తరిస్తోన్న హిమాలయ సరస్సులు' పేరుతో నివేదికను ఇస్రో విడుదల చేసింది. 2016-17లో గుర్తించిన 2,431 సరస్సుల్లో 601(89 శాతం) రెండు రెట్లు కంటే ఎక్కువ, పది సరస్సులు తమ పరిమాణం కంటే ఒకటిన్నర నుంచి రెండు రెట్లు, 65 సరస్సులు ఒకటిన్నర రెట్లు మేర విస్తరించాయని, వీటి పరిమాణం గత 38 ఏళ్లలో రెట్టింపు అయిందని ఆందోళన వ్యక్తం చేసింది. భూ వాతావరణం వేడెక్కుతుండటంతో భౌగోళిక మార్పులు సంభవించి హిమనీనదాలు కరిగిపోతున్న సంగతి తెలిసిందే. దీనివల్ల కొత్తగా సరస్సులు ఏర్పడటం, ఉన్న సరస్సులు విస్తరించి లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచెత్తే ప్రమాదం ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 1984 నుంచి 2023 వరకు భారతీయ హిమాలయ నదీ పరివాహక ప్రాంతాలను పర్యవేక్షించే దీర్ఘకాలిక ఉపగ్రహాలు తీసిన ఫొటోలను విశ్లేషించిన ఇస్రో...నదులు, సరస్సుల పరిమాణంలో గణనీయ మార్పులు వచ్చినట్టు గుర్తించింది.

ప్రజాస్వామ్యం అపహాస్యం: డీకే సురేశ్

బెంగళూరు: ప్రధాని నరేంద్ర మోదీ తన స్థాయికి తగని వ్యాఖ్యలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని కాంగ్రెస్ ఆక్షేపించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆస్తుల పున:పంపిణీ చేసి కొందరికి వాటిని కట్టబెడుతుందని చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొంది. రాజస్థాన్‌లోని జలోర్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ దేశ వనరులపై తొలి హక్కు ముస్లింలకు ఉంటుందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ మీ ఆస్తులను లాగేసుకుని తమకు ఇష్టమైన వారికి కట్టబెడుతుందనే తరహాలో మోదీ మాట్లాడటం సరైంది కాదని కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ అన్నారు. ప్రధాని నుంచి ఆ తరహా ప్రకటనను దేశం ఆశించలేదని కాంగ్రెస్ సురేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రధాని చేసిన వ్యాఖ్యలు సహించరానివని పేర్కొన్నారు. గతంలో మాజీ ప్రధానులు ఎంతో హుందాగా, మర్యాదగా వ్యవహరించేవారని, వారు విపక్షాన్ని గౌరవించేవారని గుర్తుచేశారు. ప్రతిపక్షాలను అప్పటి ప్రధానులు విమర్శించినా హుందాగా వ్యాఖ్యలు చేసేవారని గుర్తుచేశారు. కేరళలో తమ ప్రచారం సాఫీగా సాగుతోందని, గత ఎన్నికల కంటే మెరుగైన స్థానాలు సాధిస్తామని చెప్పారు.

ఏఎంయూ వీసీగా నైమా ఖాతూన్

న్యూఢిల్లీ: అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ నైమా ఖాతూన్ నియమితులయ్యారు. రాష్ట్రపతి ఆమోదించిన అనంతరం కేంద్ర విద్యాశాఖ ఆమెను విసిగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె యూనివర్సిటీ విజిటర్‌గా ఉన్నారు. ఏఎంయూ 123 ఏళ్ల చరిత్రలో వీసీగా నియమితులైన మొదటి మహిళగా ఖాతూన్ చరిత్ర సృష్టించారు. బేగం సుల్తాన్ జహాన్ 1920లో ఏఎంయూ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. ఆ పదవిలో ఉన్న మొదటి, ఏకైక మహిళగా ఆమె నిలిచారు. ఖాతూన్ నియామకంతో మహిళా వైస్ ఛాన్సలర్‌లను కలిగిన మూడవ సెంట్రల్ యూనివర్సిటీగా ఏఎంయూ నిలిచింది. శాంతిశ్రీ ధూలిపూడి...పండిట్ జేఎన్‌యూ వైస్ ఛాన్సరల్ కాగా, నజ్మా అక్తర్ 2023లో జామియా మిలియా ఇస్లామియా వైస్ ఛాన్సలర్‌గా తన పదవీ కాలాన్ని పూర్తి చేశారు. నైమా ఖాతూన్ 1988 ఆగస్టులో ఏఎంయూ లెక్చరర్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. పదేళ్లకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2006లో ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. సైకాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్, చైర్‌పర్సన్‌గా పనిచేశారు. అనంతరం 2014 జులైలో మహిళా కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఏఎంయూలో వివిధ అడ్మినిస్ట్రేటివ్ పదవుల్లోనూ కొనసాగారు. విదేశీ యూనివర్సిటీల్లోనూ ఏడాది పాటు బోధన కొనసాగించారు. నైమా ఖాతూన్ పొలిటికల్ సైకాలజీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. విదేశాల్లోని అనేక యూనివర్సిటీల్లో తన పరిశోధనా పత్రాలు సమర్పించారు.

కాంగ్రెస్ గెలిస్తే షరియా చట్టం తెస్తారు: యోగి

అమ్రోహా: కాంగ్రెస్ పార్టీపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరోపణలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే 'షరియా చట్టం' తెచ్చేందుకు ఆ పార్టీ కుట్ర చేస్తోందని చెప్పారు. దేశంలో షరియా చట్టాన్ని అమలు చేయడం, ప్రజల సంపద వారికే తిరిగి పంచేయడం వంటివి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఉద్దేశంగా కనిపిస్తోందని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ, దాని భాగస్వాములు దేశాన్ని వంచించాయని, మరోసారి తప్పుడు మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను పరిశీలిస్తే తాము అధికారంలోకి వస్తే షరియా చట్టాన్ని అమలు చేస్తామని చెప్పినట్టు స్పష్టంగా కనిపిస్తుందని అమ్రోహాలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో యోగి వ్యాఖ్యానించారు. ఒకటే తాను అడగదలచుకున్నానని, బాబా సాహెబ్ రూపొందించిన రాజ్యాంగం ప్రకారం దేశం నడుస్తోందా? షరియత్ ప్రకారం నడుస్తోందా అని యోగి ప్రశ్నించారు. వేర్వేరు కమ్యూనిటీలకు వేర్వేరు చట్టాలు అమలు చేస్తామంటూ కాంగ్రెస్ మాట్లాడుతోందని, దాని అర్థం దేశంలో షరియా చట్టం అమలు చేస్తామని స్పష్టంగా చెప్పడం కాదా అని నిలదీశారు. ట్రిపుల్ తలాఖ్‌ను మోదీ సర్కార్ రద్దు చేయడంతో షరియా చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ అనుకుంటోందని యోగి ఆక్షేపించారు.

కరువు నిధులు ఎందుకివ్వరు?

కేంద్రం వైఖరికి నిరసనగా బెంగళూరులో సీఎం ధర్నా

బెంగళూరు: కేంద్రం ఇచ్చిన కరువు సహాయక నిధులపై సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా కాంగ్రెస్ నేతలు బెంగళూరులో మంగళవారం నిరసన తెలిపారు. కేంద్రం సవతి తల్లిలా వ్యవహరిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. సీఎం సిద్ధ రామయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ తరపున కేంద్రానికి నిరసన తెలిపామన్నారు. కర్నాటక రైతులను నరేంద్ర మోదీ, అమిత్ షా ద్వేషిస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 22న కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చామని, ఆ తర్వాత కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చి పరిశీలించి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో 223 తాలూకాల్లో కరువు తాండవిస్తోందన్నారు. అమిత్‌షా చెన్నపట్నం వచ్చి ప్రభుత్వం ఆలస్యంగా వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారని మండిపడ్డారు. కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటి వరకు రైతులకు రూ.650 కోట్లు పంపిణీ చేశామన్నారు. నిర్మలా సీతారామన్, నరేంద్ర మోదీ కారణంగా కర్నాటకకు ఊరట లభించలేదని, రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా ఆరోపించారు. మోదీ ప్రభుత్వంపై కర్నాటక రైతులు, ప్రజలు ప్రతీకారం తీర్చుకోవాలని కోరారు. బీజేపీ ప్రతీకార రాజకీయాలు తెరపైకి వస్తున్నాయన్నారు. రూ.18,172 కోట్లు ఇవ్వకుండా కర్నాటక గడ్డపై అడుగుపెట్టే హక్కు బీజేపీ నేతలకు లేదన్నారు.

మత రిజర్వేషన్లకు మేము దూరం

ప్రధాని మోదీ

జైపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రత్యేక ఓటు బ్యాంకు కోసం ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వాలని ఆ పార్టీ ప్రయత్నించిందని, దళితులు, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ బ్రేక్ చేసిందని ప్రధాని మోదీ విమర్శించారు. రాజ్యాంగం దీనికి పూర్తిగా వ్యతిరేకంగా ఉందన్నారు. కేవలం మతం ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు ఇచ్చిందన్నారు. దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులకు దక్కాల్సిన హక్కులను ముస్లింలకు ఇచ్చినట్లు ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్‌లోని టోంక్ సవాయి మాదోపూర్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 2004లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన తర్వాత... ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తగ్గించాలని భావించిందన్నారు. ఆ రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వాలని ప్రయత్నించినట్లు చెప్పారు. ఏపీలో నాలుగుసార్లు ముస్లిం రిజర్వేషన్లు అమలు చేయాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. కానీ చట్టపరమైన చిక్కుల వల్ల అది సాధ్యం కాలేదన్నారు. మోదీ మీకో గ్యారెంటీ ఇస్తున్నారని, దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులకు చెందిన రిజర్వేషన్లు తీసివేయమని, మతం ఆధారంగా ఆ రిజర్వేషన్లు విభజించబోమని మోదీ తెలిపారు. తనకు రాజ్యాంగం అర్థం అవుతుందని, రాజ్యాంగ రక్షణకు తాను కట్టుబడి ఉన్నానని, బాబా సాహెబ్ అంబేద్కర్‌ను తాను ఆరాధిస్తానని ప్రధాని తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్‌చాలీసా వినడం కూడా కాంగ్రెస్ పార్టీ దృష్టిలో తప్పు అని అన్నారు. ప్రజల సంపదను లాక్కుని కొందరికి పంచిపెట్టే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. శ్రీరామనవమి రోజు రాజస్థాన్‌లో మొదటిసారి శోభాయాత్ర ఊరేగింపు జరిగింది. రామ్-రామ్ అని జపించే రాజస్థాన్ వంటి రాష్ట్రంలో ప్రజలు రామనవమి జరుపుకోకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పండుగను నిషేధించిందని మోదీ ఆరోపించారు. దేశ సంపదను ఎక్కువ మంది పిల్లలున్నవారికి, చొరబాటుదారులకు పంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్నట్లు మోదీ ఆరోపించారు. మీరు కష్టపడి సంపాదించిన మీ ఆస్తిని జప్తు చేసే హక్కు ప్రభుత్వాలకు ఉందా అని ప్రశ్నించారు. మహిళల దగ్గర ఉన్న బంగారానికి సంబంధించిన వివరాలు సేకరిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో చెబుతోందని, ప్రజల కష్టార్జితం, వారి ఆత్మ గౌరవానికి సంబంధించిన సంపదని ఇతరులకు పంచిపెట్టడం ఎంతవరకు న్యాయమని మోదీ ప్రశ్నించారు. మోదీ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష పార్టీల కీలక నేతలు విరుచుకుపడుతున్నారు.

ఆ సమాచారం అందుబాటులో లేదు

పున:పరిశీలనకు వచ్చిన ఫైళ్లపై రాష్ట్రపతి భవన్



న్యూఢిల్లీ: ఫైళ్లకు సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పున:పరిశీలన కోసం తిరిగి పంపారనే సమాచారం అందుబాటులో లేదని రాష్ట్రపతి భవన్ మంగళవారం ఆర్‌టీఐ ప్రశ్నకి సమాధానమిచ్చింది. సమాచార హక్కు చట్టం-2005 కింద తమిళనాడుకి చెందిన రాజ్ కపిల్ ఓ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాని, కేబినెట్, కేబినెట్ నియామకాల కమిటీ (ఏసీసీ), పార్లమెంట్, కేంద్ర మంత్రిత్వ శాఖలు, కేంద్ర ఏజెన్సీలు తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రపతి ఎన్నిసార్లు తిరిగి పంపారో తెలియజేయాలని పిటిషన్‌లో కోరారు. రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీ తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రపతి తిరిగి సమీక్షించాలని ఎన్నిసార్లు తిప్పిపంపారో కూడా తెలియజేయాలని కోరారు. అటువంటి సమాచారం అందుబాటులో లేదని రాష్ట్రపతి భవన్ డైరెక్టర్ శివేంద్ర చతుర్వేది సమాధానమిచ్చారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాతాలకు చెందిన రికార్డుల సంరక్షకుడు, నోడల్ శాఖగా వ్యవహరించే కేంద్ర హోంవ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఆన్‌లైన్‌లో ఆర్‌టీఐ పిటిషన్‌ను బదిలీ చేసినట్లు చతుర్వేది తెలిపారు. ఈ సమాధానం పట్ల సంతృప్తి చెందకపోయినట్టైతే పిటిషనర్ నెలరోజుల లోపు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ /అప్పిలేట్ అథారిటీ ముందు చట్టంలోని సెక్షన్ 19(1) కింద అప్పీల్ చేయవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్ నుండి వచ్చిన సమాధానంపై తాను దిగ్భ్రాంతికి గురయ్యానని క్రిమినాలజీలో లెక్చరర్ అయిన మిస్టర్ రాజ్ కపిల్ పేర్కొన్నారు. ప్రధాని, కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రపతి పున:పరిశీలనకు పంపినట్లు ధృవీకరించలేదు లేదా తిరస్కరించలేదని అన్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన ఫైల్స్, నిర్ణయాలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంరక్షకుడిగా ఉన్నప్పటికీ... ఆర్‌టీఐ చట్టం కింద రాష్ట్రపతి భవన్ ఏ ప్రాతిపదికన సమాధానం ఇవ్వలేదని అన్నారు. అటువంటి సమాచారం అందుబాటులో లేదని చెప్పడం అసంపూర్ణమైన, తప్పుదారి పట్టించే సమాధానమని, రాష్ట్రపతి రాజ్యాంగ పనితీరులో మాత్రమే కాకుండా వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించడంలో కీలక వ్యక్తి అని, అటువంటప్పుడు రాష్ట్రపతి భవన్‌లో డేటా ఎలా ఉండదని ప్రశ్నించారు. కాగా, గతంలోనూ ఆర్‌టీఐ కింద దాఖలైన పిటిషన్‌కు రాష్ట్రపతి భవన్ ఇదే విధమైన సమాధానమివ్వడం గమనార్హం. ప్రధాని, కేబినెట్ నిర్ణయాలను అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఎన్నిసార్లు పున:పరిశీలన కోసం పంపారో ఆర్‌టీఐ కింద సమాధానమివ్వాలని చెన్నైకి చెందిన ఓ విద్యార్థి కోరారు. ఆ పిటిషన్‌కు కూడా రాష్ట్రపతి భవన్ నుండి ఇదే విధమైన ప్రతిస్పందన వచ్చింది. విద్యార్థి యువన్ మిత్రన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

బీజేపీ నేతల ప్రసంగాల్లో ఓటమి భయం

అలీగఢ్ (యూపీ): ప్రజల ఆస్తులను తిరిగి పంచాలని కాంగ్రెస్ కోరుకుంటోందన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్ మండిపడ్డారు. ప్రధాని సహా బీజేపీ నాయకుల ప్రసంగాల్లో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. మంగళవారం ఆయన అలీఘడ్, హత్రాస్‌లోని ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా జరిగిన సభను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల అనంతరం ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటయితే... పేదలకు ప్రస్తుతం అందుతున్న రేషన్ కాకుండా అదనంగా పౌష్టికాహారం అందజేస్తామన్నారు. ఇప్పుడు మీరు పీఎం మోదీ, సీఎం యోగి ప్రసంగాలను తప్పనిసరిగా వినాలి. ఎందుకంటే ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో వారి ప్రసంగాల్లో స్పష్టమవుతోందన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల మొదటి దశ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి మరింత దిగజారిందని అఖిలేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై దుమ్మెత్తిపోసి రాజకీయలబ్ధి పొందాలని మోదీ యోచిస్తున్నారని... అందుకే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ఈసారి యూపీలో బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందన్నారు. విద్వేషాన్ని వ్యాపింపజేసే బీజేపీని చిత్తుగా ఓడించాలని అఖిలేశ్ పిలుపునిచ్చారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధి అబద్ధాలు, దోపిడీ తప్ప వేరొకటి కాదని అన్నారు. అవినీతిపరులు, నేరస్తులకు బీజేపీ గిడ్డంగి మారిపోయిందని విమర్శించారు. ఎన్నికల బాండ్ల వ్యవహారం వెలుగులోకి వచ్చాక బీజేపీకి దిక్కుతోచడం లేదని అఖిలేశ్ చెప్పారు.

భారీ ర్యాలీతో జాఫర్ నామినేషన్

బీజేపీకి వైసీపీ, టీడీపీ, జనసేన దాసోహం: రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: బీజేపీని గద్దె దింపాలంటే ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి అధ్వర్యంలో సీపీఐ అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా సి.జాఫర్ మంగళవారం నామినేషన్ వేశారు. దీనికిముందు కృష్ణ కళామందిర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ, కాంగ్రెస్, కూటమి పార్టీల జెండాలతో ర్యాలీ అద్భుతంగా జరిగింది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, జగదీష్, సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, మాజీ మంత్రి శైలజానాథ్, కాంగ్రెస్ పార్టీ అనంతపురం ఎంపీ అభ్యర్థి పాలమల్లి, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా నిలవడానికి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన పోటీ పడుతున్నాయని విమర్శించారు. మోదీ సర్కారు పదేళ్ల కాలంలో అంబానీ, అదానీలను పెంచిపోషించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. దేశంలో పేదరికాన్ని పెంచిందని చెప్పారు. రైతు సమస్యలపై పోరాడుతున్న ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపిందన్నారు. మోదీ పాలనలో ఉద్యోగాలు లేవు...ఉపాధి లేదు...అన్నదాతలను ఆదుకున్న పరిస్థితి లేదు. నల్లధనం వెనక్కి తీసుకురాలేదు. బ్యాంకులను మోసగించిన కార్పొరేట్ శక్తులకు అండగా నిలిచింది. ఈ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడం కోసం మత, విద్వేష రాజకీయాలకు తెరలేపిందని రామకృష్ణ నిశితంగా విమర్శించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆస్తులను ముస్లింలకు పంచుతారంటూ ప్రధాని మోదీ హిందువులను రెచ్చగొడుతున్నారన్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. భారతదేశం ప్రమాదంలో ఉందని, తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాజ్యాంగం అమల్లో ఉండదన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఇండియా కూటమి తరపున అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీపీఐ అభ్యర్థి జాఫర్ కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. అనంతపురం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పాలమల్లి హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, అనంత నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, టి.నారాయణస్వామి, జి.సంతోశ్ కుమార్, నాగరాజు, సహాయ కార్యదర్శులు అలీపీరా, రమణ, మైనారిటీ విభాగం నగర ప్రధాన కార్యదర్శి ఖాజ హుస్సేన్, సింగనమల నియోజకవర్గ కార్యదర్శి పి.నారాయణస్వామి, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి పి.రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండి నామినేషన్

- ప్రజాస్వామ్య రక్షణకు ఇండియా గెలుపు అవశ్యం
- జల్లి విల్సన్, అక్కినేని వనజ

విశాలాంధ్ర-ఏలూరు: ఇండియా కూటమి పక్షాలు సీపీఎం, కాంగ్రెస్, భారత్ బచావో, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరిచిన సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి మంగళ వారం ఆనందోత్సాహాలు, కోలాహలం మధ్య నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ముక్కంటికి అందజేశారు. దీనికిముందు స్థానిక పాతబస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి... ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పార్టీ జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పార్టీ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కోనసీమ అంబేద్కర్ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి అరటికట్ల రవి, కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, భారత్ బచావో నాయకులు గుబ్బల నాగేశ్వరరావు, ఇండియా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నేతలు మద్దతు ప్రకటించారు. నామినేషన్ అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతున్న బండి వెంకటేశ్వర రావుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శిం చారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవా లంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని కోరారు. అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి స్థానికంగా పరిచయాలు గల బండి వెంకటేశ్వరరావును గెలిపించడం ద్వారా సమస్యలు పరిష్కరించుకోగలు గుతామని తెలిపారు. ఏలూరు నగరాభివృద్ధి సీపీఐ అభ్యర్థి విజయంతోనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా బూర్జువా పార్టీల నుంచి ఎమ్మెల్యేలుగా పనిచేశారని, వీరి హయాంలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును కంకి కొడవలి గుర్తుపై, ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యకు హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో సీపీఐ తరపున ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వీరమాచనేని విమలాదేవి, అత్తులూరి సర్వేశ్వరరావు వంటి ఉద్దండుల స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలిచి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, బత్తుల వెంకటేశ్వరరావు, బాడిస రాము, మైసాక్షి వెంకటాచారి, కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబా, కంచర్ల గురవయ్య, జమ్మి శ్రీనివాసరావు, జేవీ రమణ రాజు, కొండేటి బేబి, రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, కలిశెట్టి వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, మావూరి విజయ, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, కాంగ్రెస్ నుండి దండుబోయిన చంద్రశేఖర్, మూర్తి, సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ర్యాలీ

నామినేషన్ సందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు ఉదయం గం.10.30కి చేరుకున్నారు. ఎర్ర టోపీలు, గొడుగులు ధరించి, సీపీఐ జండాలు చేతబూని ఎండను సైతం లెక్కచేయకుండా వడివడిగా నడుస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఎర్రచీరలు ధరించిన మహిళలు, వలంటీర్లు ర్యాలీని క్రమశిక్షణతో సమన్వయం చేస్తూ కమ్యూనిస్టు పార్టీ సత్తా చాటారు. వాసవి సిల్క్స్, మెయిన్ బజార్, బిర్లాభవన్ సెంటర్, బంగారం షాపుల రోడ్డు, గడియార స్తంభం, కుండీ సెంటర్, మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు ఆద్యంతం ఉత్సాహభరితంగా ర్యాలీ కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారుల డప్పులతో ర్యాలీ సాగింది.

అరసం కవితల పోటీల ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-గుంటూరు: ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 'నేటి ఎన్నికల తీరుతెన్నులు' అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల ఫలితాలను అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మంగళవారం గుంటూరులో విడుదల చేశారు. కవితల పోటీల్లో పతివాడ నాస్తిక్ (విశాఖపట్నం) రాసిన 'మర్యాదస్తుల రాజ్యం కోసం' కవిత ప్రథమ బహుమతి రూ.3 వేలు, 'చెరువు ఎగిరిపోయింది'-నల్లు రమేష్ (పోతిరెడ్డిపాలెం) కవిత ద్వితీయ బహుమతి రూ.2 వేలు, 'పొంచేట – మొద్దు చీపిరి'-మోకా రత్నరాజు (మానేపల్లి) మూడవ బహుమతి రూ.1,000 గెలుపొందారని వెల్లడించారు. కాగా, 'అయ్యా! నేను ఓటెయ్య'-మోహనవల్లి జింకల (మదనపల్లి), 'సీతాకోకచిలుక తిరోగమనం'-అవ్వారు శ్రీధరబాబు (నెల్లూరు), 'నోటా తూటా పేల్చే తెలివైన షూటరు'-తరిగొప్పుల వి.ఎల్లెన్ మూర్తి (మదనపల్లి) కవితలకు ప్రత్యేక బహుమతిగా రూ.500 గెలుపొందారని చెప్పారు. పోటీకి వచ్చిన 84 కవితలలో 14 సాధారణ ప్రచురణకు అర్హమైన కవితలు ఉన్నాయన్నారు. ప్రముఖ కవుల కవితలతో ప్రచురిస్తున్న 'ఎన్నికల భారతం' కవితా సంకలనాన్ని మే 1వ తేదీ మే డే రోజున గుంటూరులో జరగనున్న సభలో డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారని తెలిపారు. గుంటూరు డిస్ట్రిక్ సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రాంగణంలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షతన కవితాగోష్టి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ బహుమతి విజేతలకు నగదు మొత్తాన్ని, పుస్తక ప్రచురణకు పాక్షిక ఆర్థిక సాయాన్ని చెరుకూరి రఘునాధరావు అందజేయనున్నట్లు తెలిపారు.

గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ నామినేషన్ సందర్భంగా నగర వీధుల్లో జరిగిన భారీ ప్రదర్శనలు. ఇందులో ముప్పాళ్ల నాగేశ్వరరావు, కోట మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ ఉత్సాహభరితంగా జరిగింది.

'ఇండియా' అభ్యర్థులను గెలిపించండి

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విశాఖ: ఎన్నికల్లో 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపు నిచ్చారు. విశాఖ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పి.సత్యారెడ్డి మంగళ వారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్ని స్తోందని విమర్శించారు. మోదీ సర్కార్ గత 10 ఏళ్లలో ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేయలేద న్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేదల బతుకు భారంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టారని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. విశాఖ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.సత్యారెడ్డి అల్లిపురంలోని జెండా చెట్టు దుర్గాలమ్మ గుడి నుంచి ప్రదర్శన ప్రారంభించి పూర్ణ మార్కెట్, జగదాంబ జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల, విశాఖ సౌత్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వాసుపల్లి సంతోష్, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె. అచ్యుతరావు, జె.డి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' కూటమిని బలపరచండి

- నిరంకుశ బీజేపీ, వైసీపీని ఓడించండి
- పత్తికొండ సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య ఎన్నికల ప్రచారంలో నేతలు

విశాలాంధ్ర-వెల్దుర్తి: మే13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 'బీజేపీని ఓడిద్దాం-దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా వామపక్ష, లౌకికశక్తులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కర్నూలు జిల్లాలోని పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళ వారం రామచంద్రయ్య గెలుపు కోసం వెల్దుర్తి పట్టణంలో సీపీఐ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా పార్టీ శ్రేణులు నిర్విరామంగా శ్రమించాలన్నారు. కేం ద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల బాండ్ల రూపంలో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని, ఈ విషయాలు ప్రజలకు తెలియకుండా ఉంచేందుకు ప్రతిపక్ష నాయకులను ప్రజాస్వామ్యానికి విరు ద్ధంగా నిరంకుశత్వంతో అరెస్టు చేస్తోందని విమ ర్శించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో బీజేపీ కూటమిగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలను, నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాల అమలు చేస్తున్న వైసీపీని ఓడించి 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్య క్షులు శ్రీనివాసులు, మహిళా సమాఖ్య నాయకులు సులోచనమ్మ, కర్నూలు నగర కార్యవర్గ సభ్యులు సురేంద్ర, డీహెచ్‌పీఎస్ నాయకులు కుమార్ రాజా, డీసీసీ సెక్రెటరీ శేషు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖాదర్ బాషా, సీపీఐ మండల సహాయ కార్యదర్శి డి.రాజు, రైతు సంఘం అధ్యక్షుడు బాలరాజు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్న మధు, కాంగ్రెస్, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సీపీఐ 'పశ్చిమ' అభ్యర్థి కోటేశ్వరరావు ముమ్మర ప్రచారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన బీజేపీ, వైసీపీలకు ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మన రాష్ట్ర రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితికి తీసుకొచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాల్సిన అవసరం ఉందని అన్నారు. 46వ డివిజన్‌లో మంగళవారం జెండాచెట్టు వీధి, జోసఫ్ వీధి, షరీఫ్ వీధి, ఏసురత్నం వీధి, దేవయ్యవీధి, రామారావు వీధి, ఎస్‌డీఏ చర్చి వీధి, గురుస్వామి వీధి తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోటేశ్వరరావు హామీ ఇచ్చారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వాటి ఫలితంగా ప్రతి కుటుంబంపై పడుతున్న అదనపు భారాలను వివరించారు. చట్టసభల్లో ప్రజల గొంతుకను వినిపించేందుకు, పన్నుల భారంలేని, అవినీతి రహిత పాలన కోసం కమ్యూనిస్టులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గతంలో కమ్యూనిస్టు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు చేసిన సేవలను, అభివృద్ధిని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల పాలనలోనే పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, కొండ ప్రాంతాల్లో మెట్లు, సైడు కాలువలు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించామని వివరించారు. గతంలో సీపీఐ కార్పొరేటర్ తాజ్‌నోత్‌దాస్ అద్భుత సేవలు అందించారని గుర్తుచేశారు. కొండ పైభాగాన నివాసం ఉంటున్న ప్రజలకు బూస్టర్ల ద్వారా తాగునీటిని పుష్కలంగా సరఫరా చేశామని చెప్పారు. నేడు స్వయంగా మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 42వ డివిజనులో తాగునీటి కోసం అల్లాడుతున్నామని ప్రజలే చెబుతున్నారని పేర్కొన్నారు. కృష్ణమ్మ చెంతనే ఉన్నా ప్రజలు తాగునీటి కోసం అల్లాడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేస్తున్నవారిని, వలస వచ్చి కోట్లు కుమ్మరించి ఓట్లు కొనుగోలు చేయాలని ప్రయత్నించే అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపిస్తే కొండప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కోటేశ్వరరావు హామీ ఇచ్చారు. సీపీఐ మాజీ కార్పొరేటర్ డీవీ రమణబాబు, కె.శివకుమార్, షేక్ నజీర్, కే వెంకటేశ్వరరావు, మీరావలీ, లంక గోవిందరాజు పాల్గొన్నారు.

మురికివాడలు తీర్చిదిద్దుతా

ప్రచారంలో దూసుకుపోతున్న సీపీఐ తిరుపతి అభ్యర్థి మురళి

విశాలాంధ్ర-తిరుపతి: వైసీపీ పాలనలో మురికి వాడల పరిస్థితి కడు దయనీయంగా ఉందని, ఎస్టీవీ నగర్, న్యూ ఇందిరానగర్ దానికి నిదర్శనమని ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పీ మురళి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఎస్టీవీ నగర్, న్యూ ఇందిరానగర్, ఎయిర్ బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో సీపీఐ సీనియర్ నేత బి.తులసేంద్ర, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పెద్దఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ నేటికీ ఇరుకైన రోడ్లు, అస్తవ్యస్తంగా పారిశుధ్యం, తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. లైబ్రరీ సెస్ కడుతున్నా వాటిని మూసివేయడం కార్పొరేషన్ నిర్లక్ష్యమని అన్నారు. తనను గెలిపిస్తే మురికివాడలను తీర్చిదిద్దుతానన్నారు. నగర సమగ్రాభివృద్ధికి, మునిసిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ నియంతృత్వం పోకడలు అనుసరి స్తుందని విమర్శించారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్రంలోని బీజేపీతో అంటకాగుతున్న టీడీపీ-జనసేన కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు. తులసేంద్ర మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు టీ. జనార్ధన్, నగరి కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు, చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, సీపీఎం నేత మాధవ కృష్ణ, వేణుగోపాల్, బుజ్జి, వాసు, వెంకటేశ్, బండి చలపతి, ఎన్.డి. రవి. శ్రీరాములు, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, ఏ బాబు, వైయస్. మణి, అల్లా బక్ష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

సమరాంగణం 2024

రాజస్థాన్‌లో కమలం కష్టాలు

- తొమ్మిది స్థానాల్లో లేని పట్టు
- మరో మూడు చోట్ల గట్టిపోటీ
- ఇండియా కూటమిదే పైచేయి

సార్వత్రిక ఎన్నికల రెండవ దశలో భాగంగా ఈనెల 26న పోలింగ్ జరిగే రాష్ట్రాల్లో రాజస్థాన్ ఉంది. ఇక్కడ 13 లోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రంలో మొత్తం 25 స్థానాలు తమవే అన్నట్లు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితులు, స్థానిక సమస్యలను పట్టించుకోకుండా గెలుపే లక్ష్యంగా అగ్ర నేతలతో ప్రచారం చేయిస్తోంది. ఇండియా కూటమిపై తీవ్రస్థాయిలో విమర్శల దాడి చేస్తోంది. మత ప్రచార ఉధృతి పెంచింది. వాస్తవానికి బీజేపీది మేకపోతు గాంభీర్యమని తాజాగా జరిగిన మూడు సర్వేల్లో తేలిపోయింది. తొమ్మిది స్థానాల్లో కాషాయ వర్గానికి పట్టు లేదని... మరో మూడు స్థానాల్లో నిలద్రొక్కుకునేందుకూ అష్టకష్టాలు పడుతున్నదని వెల్లడైంది. ఇండియా కూటమిదే పై చేయి అని నివేదికలు పేర్కొన్నాయి.

హిందీ రాష్ట్రాల్లో రాజస్థాన్ ముఖ్యమైనది. రాజస్థాన్‌లో మొత్తం 25 లోక్‌సభ సీట్లను గెలుచుకోగలనన్న ధీమాతో బీజేపీ ఉంది కానీ పరిస్థితులు ఆ పార్టీకి అనుకూలంగా లేవు. తొమ్మిది సీట్లలో బీజేపీకి ఓటమి తప్పదని ప్రీపోల్ సర్వేలలో వెల్లడైంది. మరో మూడు చోట్ల కమల దళం గెలవాలంటే చాలా కష్టపడాల్సి రావచ్చని నివేదికలు పేర్కొన్నాయి. అజ్మీర్, పాలీ, జోధ్‌పూర్, బర్మార్, ఉదయ్‌పూర్, చిత్తోర్‌గఢ్, రాజ్‌సమాన్, భిల్వారా, ఝులావర్-బారన్ స్థానాలలో ఇండియా కూటమిదే పైచేయిగా తేల్చాయి. అదే విధంగా టోంక్-సవైమాధిపూర్, జాలోర్, కోటా స్థానాల్లోనూ బీజేపీకి గెలుపు అవకాశాలు సన్నగిల్లాయని పేర్కొన్నాయి. బాన్సవారాలోనూ 'ఇండియా' భాగస్వామి బీఏపీ బలంగా ఉందని తెలిపాయి. మొత్తంగా రాజస్థాన్‌లో కమలం వికసించలేదన్న సంకేతాలిచ్చాయి. దీంతో తాజా ఎన్నికలు ఉత్కంఠభరితంగా మారాయి.

గత ఎన్నికల్లో నాగౌర్ స్థానాన్ని కైవసం చేసుకున్న ఆర్‌ఎల్పీ క్రమంగా ఎన్డీయేకు దూరమైంది. మూడు నల్ల సాగు చట్టాలను 2020లో మోదీ ప్రభుత్వం తీసుకురావడాన్ని ఆర్‌ఎల్పీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఫలితంగా ఎన్డీయే నుంచి నిష్క్రమించింది. ప్రస్తుతం ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంది. నాగౌర్ స్థానం నుంచి మరోమారు బరిలోకి దిగింది. ఈనెల 19న ఇక్కడ ఎన్నికలు జరిగాయి. బీజేపీని ఓడించే స్థాయిలో ఆర్‌ఎల్పీ ఉంది.

గత ఎన్నికల్లో బీజేపీ 24, ఆర్‌ఎల్పీ ఒకటి చొప్పున 25 స్థానాలు ఎన్డీయే వశమయ్యాయి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయి. ఇండియా కూటమిలోని మరో భాగస్వామి పార్టీ సీపీఎం ఈసారి సిఖర్ స్థానం నుంచి పోటీ చేసింది. మొదటి దశలోనే ఈ స్థానానికి ఎన్నిక జరిగింది. ఇక్కడి ఫలితం ఆశ్చర్యపరుస్తుందన్న భావన ఉంది.

2019 లోక్‌సభ ఎన్నికలప్పుడు రాజస్థాన్‌లో ఎన్డీయేకు 61.13 శాతం ఓట్లు రాగా బీజేపీకి 59.07శాతం, ఆర్‌ఎల్పీకి 2.06శాతం, కాంగ్రెస్‌కు 34.59శాతం చొప్పున వచ్చాయి. అప్పట్లో పుల్వామా ఘటన వల్ల బీజేపీకి గెలుపు సునాయాసమైంది. ఆ తర్వాత ఐదేళ్లలో రాష్ట్ర పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. 2023 నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు 41.70 శాతానికి పడిపోగా ఆర్‌ఎల్పీకి 2.38శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ ఓట్లు 39.58శాతానికి చేరాయి. బీజేపీ రెండు స్థానాలకు పరిమితమైంది. ఐఎన్‌డీ నాలుగు స్థానాలు దక్కించుకోగా, ఓ స్థానంలో ఆర్‌ఎల్పీ గెలిచింది. ప్రస్తుతం నాగౌర్‌లోనూ ఆర్‌ఎల్పీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ)... బాన్సవారా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తోంది. కాంగ్రెస్‌తో పొత్తు క్రమంలో ఈ స్థానం బీఏపీకి దక్కింది. రెండవ దశలో భాగంగా ఈనెల 26న బాన్సవారాలో పోలింగ్ జరగనుంది. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చౌరసి నియోజకవర్గం నుంచి బీఏపీ గెలిచింది. ఈ స్థానంలో ఇప్పటికూడా బీజేపీ కంటే బీఏపీ బలంగా ఉంది. బాన్సవారా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది స్థానాల్లో ఈ స్థానం ఒకటి. కాగా, ఐదు శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది.

కాంగ్రెస్ ప్రస్తుతం 22 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తోంది. మొత్తంగా 12 లోక్‌సభ స్థానాల్లో మొదటిదశలో పోలింగ్ జరిగింది. ఇండియా కూటమి అభ్యర్థుల కంటే ఎన్డీయే బలంగా ఉన్న స్థానాలు నాలుగు మాత్రమే కావడం బీజేపీతో పాటు ప్రధాని మోదీకి మింగుడుపడటం లేదు. జైపూర్, భరత్‌పూర్, బికానీర్, దౌసాలో ఇండియా కూటమి అభ్యర్థులదే పైచేయిగా ఉంది. అలాగే ఆల్వార్, చురు, గంగానగర్, జైపూర్ రూరల్, ఝున్‌ఝును, కారూలి-ధోల్పూర్ స్థానాల్లో కాంగ్రెస్ గెలవవచ్చు. దాని మిత్రపక్షాలైన ఆర్‌ఎల్పీ, సీపీఎం ఒక్కో స్థానాన్ని గెలుచుకునే అవకాశమున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటింది కాబటి లోక్‌సభ ఎన్నికల్లోనూ రాణిస్తోందన్న అంచనా ఉంది. అప్పటి కంటే కూడా కాంగ్రెస్ ఇప్పుడే బలంగా ఉంది.

వాస్తవ పరిస్థితి కమల దళాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. మోదీ, బీజేపీ-ఆర్‌ఎస్ఎస్ నేతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అందుకోసమే రెండవ దశలో పోలింగ్ జరగబోయే 13 స్థానాల్లో ప్రజలను ప్రభావితం చేసేందుకు మతాధారిత ప్రచారానికి జోరు పెంచారు. పోలింగ్ జరగబోయే 13స్థానాల్లో తొమ్మిది చోట్ల బీజేపీకి గెలిచే అవకాశాలు లేకపోగా మరో మూడు చోట్ల గట్టి పోటీ తప్పడంలేదు.

మోదీజీ మీరేం చేశారు!

అచ్చే దిన్ అన్నారు
కష్టాల కడలిలోకి నెట్టివేశారు
నోట్ బందీ అన్నారు
పేదల ఉసూరు తీశారు
లాక్‌డౌన్ అన్నారు
కార్మికుల బతుకుల్ని రోడ్డున పడేశారు
మోదీజీ మీరేం చేశారు!
నన్ను నమ్మండి అన్నారు
నట్టేట ముంచారు
ధరల నియంత్రణ అన్నారు
జీఎస్టీ బాదుడు బాదారు
వికాసం అన్నారు
వినాశనాన్ని మిగిల్చారు
మందిర్, మసీదు అన్నారు
మత ఘర్షణలు రగిల్చారు
కులం, మతం అన్నారు
దేశాన్ని విభజించారు
మోదీజీ మీరేం చేశారు!
ప్రగతిలో ముందున్నాం అన్నారు
ప్రపంచ సూచీల్లో అధమానికి చేర్చారు
గ్యారంటీల వర్షం కురిపించారు
జుమ్లా అంటూ కొట్టిపారేశారు
పదేళ్లలో స్వర్గం చేస్తానన్నారు
నరకం చేసి వదిలారు
మోదీజీ మీరేం చేశారు!
రైతును రాజు చేస్తానన్నారు
దేశద్రోహిగా ముద్రవేశారు
అవినీతిని పారద్రోలతానన్నారు
అక్రమార్కులకు పదవులు కట్టబెట్టారు
విమర్శలే బలమన్నారు
విమర్శకుల గొంతు నొక్కారు
ప్రజాస్వామ్యం అన్నారు
అసమ్మతిని అణిచేశారు
పత్రికా స్వేచ్ఛ అన్నారు
కలానికి సంకెళ్లు వేశారు
మోదీజీ మీరేం చేశారు!
అంధ భక్తులను పోగేశారు
వానర సైన్యమని మురిసిపోతారు!!
రామ రాజ్యం అంటారు
రాక్షక పాలన సాగిస్తారు!!
మోదీజీ మీరేం చేశారు!
మరో ఐదేళ్లు అంటారు
దేశాన్ని నిలువునా అమ్మేస్తారు
శాంతి అంటారు
రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తారు
సబ్ కా సాథ్... సబ్ కా వికాస్ అంటారు
వివక్ష చూపిస్తారు... విభజన చేస్తారు
మోదీజీ మీరేం చేశారు!
గ్యారంటీకే గ్యారెంటీ అంటారు
అదంతా జుమ్లా అని కొట్టిపారేస్తారు
మైనారిటీలు వద్దంటారు
మెజారిటీలను చీల్చేస్తారు
మోదీజీ మీరేం చేశారు!
విపక్షమే లేదంటారు
ఈడీ, సీబీఐ, ఐటీ అస్త్రాలు ప్రయోగిస్తారు
స్వచ్ఛంధ నిధులంటారు
ఎలక్టోరల్ బాండ్ల కథ నడిపిస్తారు
ఈశాన్యం అభివృద్ధి చేస్తామంటారు
మణిపూర్‌ను పూర్తిగా మరిచారు
జమ్మూకశ్మీర్, లధక్‌కు న్యాయం అంటారు
సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను విస్మరించారు
మోదీజీ మీరేం చేశారు!
ఓటరును మేల్కొలిపారు
మంచి గుణపాఠం నేర్పారు
మాటల మాయలో పడొద్దని బుద్ధి చెప్పారు
యుక్తికి పనిచెప్పాలని హితవు పలికారు
ఓటు విలువను తెలియజేశారు
మోదీజీ మీరేం చేశారు!

- షాయిస్తా ఖానూమ్ పఠాన్

ఓటుపై ప్రముఖుల మాట

- అవినీతిని సూటిగా ప్రశ్నించే ధైర్యం/సమయం లేనప్పుడు చాటుగానైనా శిక్షించు : అంబేద్కర్
- బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైనది: అబ్రహాం లింకన్
- ఓటు వేయకపోవడమంటే లొంగి పోవడమే: ఎల్లిసన్
- ఓటు వేయకపోతే నువ్వు లెక్కలోకి రావు పెలోసీ
- మార్పు కోరుకుంటే సరిపోదు.. ఓటు వేసి మార్పు చూడాలి: టేలర్ స్విఫ్ట్
- మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు తెలివిగా సిద్ధమైతే తప్ప ప్రజాస్వామ్యం విజయం సాధించదు: రూజ్వెల్ట్

స్ట్రాంగ్ రూమ్ అంటే...

ఎన్నికలు వచ్చాయంటే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల అవసరం ఏర్పడుతుంది. ఓటర్లు ఎంతో నమ్మకంగా తమ ఓటును ఈ యంత్రాల్లో నిక్షిప్తం చేస్తారు. అనేకమంది అభ్యర్థుల రాజకీయ జీవితాలు వీటిపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి ఈ యంత్రాంలకు ప్రాధాన్యత ఎక్కువ. ఈవీఎంలు, వీవీప్యాట్‌లను ఓటింగ్‌కు తరలించడానికి, ఆపై వాటిని భద్రపర్చడానికి ఎన్నికల సంఘం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుంది. ఓటింగ్ ముగిసిన తర్వాత నిర్దేశిత సిబ్బంది ఈ యంత్రాంలను అత్యంత సురక్షిత ప్రదేశంగా ఎంపిక చేసిన చోటుకు చేరుస్తారు. దానినే స్ట్రాంగ్ రూమ్ అంటారు. ఓటింగ్ జరిగిన రోజు నుంచి ఓట్లను లెక్కించే రోజు వరకు ఈవీఎంలకు భద్రత అవసరం. ఇందుకు ఎన్నికల సంఘం, పోలీసులు ఎలాంటి ఏర్పాట్లు చేస్తారో తెలుసుకుందాం.

ఏదో ఒక గదిని స్ట్రాంగ్ రూమ్‌గా మార్చందుకు వీలుండదు. దీనికి కొన్ని ప్రమాణాలు ఉంటాయి. డబుల్ లాకింగ్ సిస్టమ్‌తో కూడిన బలమైన గదిని స్ట్రాంగ్ రూమ్‌గా ఎంపిక చేస్తారు. ఎన్నికల సంఘం ప్రకారం స్ట్రాంగ్‌రూమ్ అనబడే గదికి ఒకటే తలుపు ఉండాలి. ప్రవేశ ద్వారం మినహా మరే మార్గంలోనూ లోనికి వెళ్లేందుకు ఆస్కారం ఉండరాదు. అలాగే దానికి డబుల్ లాక్ సిస్టమ్ ఉండాలి. వర్షం లేదా వరద సంభవించి గదిలోకి నీరు రాకూడదు. ఒకవేళ వచ్చినా ఆ నీరు సులువుగా బయటకు వెళ్లిపోయేలా స్ట్రాంగ్‌రూమ్ ఉండాలి. అగ్ని ప్రమాదం సంభవించినా ఆ గది గోడలకు ఎటువంటి నష్టం జరగకుండా ఏర్పాట్లు చేస్తారు. ఈవీఎం, వీవీప్యాట్‌లను భద్రపర్చిన తర్వాత గదికి తాళం వేస్తారు. తాళంచెవిని ఇన్‌చార్జి, ఏడీఎం లేదా అంతకంటే పైస్థాయి అధికారి వద్ద ఉంచుతారు.

మూడంచెల భద్రత

స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల భద్రత ఉంటుంది. 24 గంటలూ సీఏపీఎఫ్ బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. స్ట్రాంగ్‌రూమ్ ముందు భాగంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి దాని భద్రతను పర్యవేక్షిస్తారు. సీఏపీఎఫ్‌తో పాటు రాష్ట్ర పోలీసులనూ మోహరిస్తారు. ప్రతి స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఒక పోలీసు అధికారి, ప్రభుత్వ అధికారి అన్ని సమయాలలో ఉంటారు. ముందు సీఏపీఎఫ్ గార్డులు, తర్వాత పోలీసులు ఆపై జిల్లాల కార్యనిర్వాహక దళానికి చెందిన గార్డులు కాపాలాలో స్ట్రాంగ్ రూమ్ ఉంటుంది. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో విద్యుత్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల నిరంతర విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రధాన ఎన్నికల అధికారి విద్యుత్ బోర్డు చైర్మన్‌కు లేఖ రాసి విద్యుత్ కోత పరిస్థితి తలెత్తకుండా చూడాలని స్థానిక విద్యుత్ బోర్డును కోరుతారు. అత్యవసర పరిస్థితుల కోసం జనరేటర్ అందుబాటులో ఉంటుంది.

పూర్ణియాలో త్రిముఖ పోరు

- కూటములు వర్సెస్ స్వతంత్రుడు
- హేమాహేమీల మధ్య ఆసక్తికర పోటీ
- ఎన్డీయే, ఇండియాకు దీటుగా పప్పు యాదవ్ ప్రచారం

బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో హేమాహేమీలు పోటీ చేస్తున్నారు. ఎన్డీయే, ఇండియాకు దీటుగా స్వతంత్ర అభ్యర్థి పప్పు యాదవ్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మండుటెండను సైతం లెక్క చేయని ఎన్నికల జోష్ స్థానికంగా కనిపిస్తోంది. ఈనెల 26న పోలింగ్ జరగబోతోంది.

పురాతన శక్తి ఆలయం-పూర్ణియా దేవి ఆలయం పేరిట ఈ నియోజకవర్గానికి పూర్ణియా అని పేరు పెట్టారు. రాజేశ్ రంజన్ (పప్పు యాదవ్) స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండగా ఎన్డీయే అభ్యర్థిగా సంతోశ్ కుష్వాహా (జేడీయూ), ఇండియా అభ్యర్థిగా బీమా భారతి (ఆర్జేడీ) పోటీ చేస్తున్నారు. అవదేశ్ మండల్ భార్య బీమా భారతి... పూర్ణియాలోని రూపౌలీ అసెంబ్లీ స్థానం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గతంలో నితీశ్ ప్రభుత్వంలో చెరకు పరిశ్రమల మంత్రిగానూ పనిచేశారు. ఈ జిల్లాలో 40శాతం మంది ముస్లింలు ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో పూర్ణియా పార్లమెంటు స్థానానికి ప్రాధాన్యతున్నది. ప్రధాన పార్టీలన్నీ దీనిపై దృష్టిని కేంద్రీకరించాయి. తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు యత్నిస్తున్నాయి.

ఓ వైపు పప్పు యాదవ్ తనను తాను పూర్ణియా బిడ్డగా చెప్పుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా సంతోశ్ కుష్వాహా (జేడీయూ) మూడవసారి గెలుపును ఆకాంక్షిస్తున్నారు. ఈ స్థానంలో జరిగిన... జరగబోయే అభివృద్ధి పేరిట... నితీశ్, మోదీ గ్యారెంటీ అంటూ ఓట్లు అడుగుతున్నారు. ఆర్జేడీ అభ్యర్థి మాత్రం తనదైన శైలిలో ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఓబీసీలు, అణగారిన వర్గాలపై నమ్మకం పెట్టుకున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్‌కున్న ప్రజాదరణ తనకు కలిసివస్తుందని భావిస్తున్నారు. ఆయన ఎంపిక చేసిన బీమా భారతిని గెలిపిద్దామన్న నినాదంతో ముందుకెళుతున్నారు.

జేడీయూ ఓటు బ్యాంకుగా ఉన్న అత్యంత వెనుకబడిన వర్గాన్ని తమ వైపునకు తిప్పుకునేందుకు అదే వర్గానికి చెందిన బీమా భారతిని ఆర్జేడీ నిలబెట్టింది. గతంలో ఇక్కడ నుంచి మూడు సార్లు ఎంపీగా ఎన్నికైన పప్పు యాదవ్ బరిలోకి దిగడంతో రాజకీయ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన స్వతంత్రుడిగా పోటీ చేస్తుండటంతో త్రిముఖ పోరు నెలకొంది. బరిలోకి దిగి పూర్ణియా పోరును ఆసక్తికరంగా, రసవత్తరంగా మార్చారు. పప్పు యాదవ్ తాను స్థాపించిన జన్ అధికార్ పార్టీ (జేఏపీ)ని ఇటీవల కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఆ పార్టీ నుంచి పూర్ణియా టికెట్ ఆశించారు. అయితే పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని ఆర్జేడీకి దక్కింది. దీంతో భంగపడ్డ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. పూర్ణియా లోక్‌సభ స్థానం పాట్నా నుంచి 200 కిమీల దూరంలో... నేపల్, బెంగాల్ సరిహద్దుల్లో ఉన్నది. ఇక్కడ వలస కార్మికులు ఎక్కువ. ఈసారి ఓటు వేసేందుకు వలస కార్మికులు స్వస్థలానికి వచ్చే అవకాశాలు లేకపోవడం అభ్యర్థులను ఆందోళన కలిగిస్తోంది.

నిరుద్యోగం, జాతీయస్థాయి కులగణన, పారిశ్రామిక వృద్ధి, బీహార్‌కు ప్రత్యేక హోదా, రిజర్వేషన్ల పరిమితి తొలగింపు వంటి హామీలతో ప్రతిపక్షాలు ప్రచారం సాగిస్తున్నాయి. మహిళా సాధికారత, 33శాతం రిజర్వేషన్, యువతకు వడ్డీలేని రుణాలు, ఎన్డీయే/మోదీ గ్యారెంటీలంటూ పాలక పక్ష ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్, నితీశ్ కుమార్ వంటి అగ్రస్థాయి నాయకులు ప్రచారాన్ని నిర్వహించినప్పటికీ పూర్ణియాలో త్రిముఖ పోరు నెలకొన్నది.

ఓటేసేందుకు ఆసక్తి చూపని వలస కార్మికులు

పూర్ణియాలో 90శాతం మంది వ్యవసాయ కార్మికులు లేదా వలస కార్మికులు కాగా 'మోదీకి హామీ', 'బేరోజ్‌గారీ హటావో' పోస్టర్లు ప్రతి ఇంటి గోడపై దర్శనమిస్తున్నాయి. దీనిని బట్టి ప్రధాన పార్టీల ప్రచార జోరు అర్థమవుతోంది. అయితే ఉపాధి కోసం వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కేవలం ఓటు వేయడానికి స్వస్థలానికి వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. ఓటు వేసినా ప్రయోజనం ఉండటంలేదని... తమ బతుకులు మారడం లేదని అంటున్నారు. ఈసారి ఓటేందుకు 2-3శాతం మంది మాత్రమే పూర్ణియాకు చేరుకునే అవకాశం ఉన్నట్లు ఇటీవల చెన్నై నుంచి ఎన్నికల కోసం కుటుంబ సమేతంగా వచ్చిన రఘువీర్ దాస్ వెల్లడించారు.

22,06,663 మంది ఓటర్లు

పూర్ణియాలో రెండు లక్షల మంది యాదవ్ ఓటర్లు ఉండగా 1.25లోల మంది బ్రాహ్మణులు, 1.25లక్షల మంది రాజ్‌పుత్‌లు ఉన్నారు. ముస్లింలు మొత్తం జనాభాలో 40శాతంగా ఉన్నారు. ఈ స్థానం నుంచి అర్హులైన ఓటర్లు 22,06,663 మంది ఉంటే వీరిలో పురుషులు 11,40,982 మంది, మహిళలు 10,65,602 మంది, థర్డ్ జెండర్‌వారు 79 మంది ఉన్నారు.

సమరాంగణం 2024

మహామహులకూ
తప్పని పరాజయాలు

ఎన్టీఆర్


నాదెండ్ల భాస్కరరావు

రోశయ్య

జనార్ధనరెడ్డి


నీలం సంజీవరెడ్డి

బెజవాడ గోపాలరెడ్డి


చంద్రబాబు

శాసనసభల ఎన్నికల చరిత్రలో పదవులు అధిష్టించకముందో... పీఠమెక్కిన తరువాతనో పరాజయాలు మూటకట్టుకున్న మహామహులెందరో ఉన్నారు. వీరిలో ముఖ్యమంత్రులు, శాసనసభ స్పీకర్లు, రాజకీయ పక్షాల ముఖ్య నాయకులు ఉన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బెజవాడ గోపాలరెడ్డి తాను ముఖ్యమంత్రి కాకపూర్వం 1952లో నెల్లూరు జిల్లా ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ(కేఎంపీపీ) అభ్యర్థి కోవి రామయ్య చౌదరి చేతిలో ఓటమి పాలయ్యారు. రాష్ట్రపతిగా, మంత్రిగా పనిచేసిన నీలం సంజీవరెడ్డి కూడా 1952లో అనంతపురం అసెంబ్లీ నియోజక వర్గంలో తన సమీప బంధువైన కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డి చేతిలో ఓటమి చెందారు. మరో ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి 1952లో పల్నాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు అభ్యర్థి కె. సుబ్బారెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆనాటికి ఆయన ఇంకా ముఖ్యమంత్రి పదవి అధిష్టించలేదు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎన్టీ రామారావు 1989లో కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చిత్తరంజన్ దాస్ చేతిలో ఓటమి చవిచూశారు. ఓటమి చెందే సమయంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి గానే ఉన్నారు. అయితే అదే ఎన్నికల్లో కృష్ణాజిల్లా గుడివాడ నుంచి ఆయన గెలిచారు. మరో మాజీ ముఖ్యమంత్రి నేదురుమిల్లి జనార్ధనరెడ్డి 1994లో వెంకటగిరిలో టీడీపీ అభ్యర్థి వివిఆర్కె యాచేంద్ర చేతిలో ఓడిపోయారు. అప్పటికి ఆయన ముఖ్యమంత్రి పదవి నిర్వహించి ఉన్నారు. మరో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 1999లో తెనాలి నుంచి పోటీచేసి టీడీపీ అభ్యర్థి డాక్టర్ గోగినేని ఉమ చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత కాలంలో ఎమ్మెల్సీగా పనిచేస్తూ ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. నెల రోజుల ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు 1994లో తెనాలి నుంచి టీడీపీ అభ్యర్థి డాక్టర్ రావి రవీంద్రనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు.

నారా చంద్రబాబు నాయుడు కూడా తాను ముఖ్యమంత్రికాక పూర్వం 1983లో చంద్రగిరి నుంచి టీడీపీ అభ్యర్థి చేతిలోఓడి పోయారు. మాజీ ముఖ్య మంత్రి కోనేరురావు (కాంగ్రెస్) 1994, 9 9 ల తియమార నుంచి టిడిపి అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే రాష్ట్ర శాసనసభలకు స్పీకర్లుగా పనిచేసిన పిడతల రంగారెడ్డి గిద్దలూరులో, ప్రతిభా భారతి ఎచ్చెర్లలో, కోన ప్రభాకరరావు బాపట్లలో ఓడిపోయారు. 1952, 55లో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి గెలుపొంది ఆంధ్ర శాసనసభ స్పీకరుగా పనిచేసిన రొక్కం లక్ష్మీనరసింహ దొర(ఆర్ఎల్ఎన్ దొర) రెండుసార్లు గెలుపొంది 1962లో ఓడిపోయారు. మరో మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు ఆరుసార్లు గెలుపొంది 2009లో ఓటమిపాలయ్యారు. అలాగే వివిధ పార్టీల్లో ప్రముఖ నేతలు కూడా రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఓడిపోయినవారే. వారిలో దివి నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు నేత చండ్ర రాజేశ్వరరావు, కూచినపూడి నుంచి మాకినేని బసవపున్నయ్య, అనంతపురం నుంచి తరిమెల నాగిరెడ్డి పరాజితులయ్యారు. సోంపేట నుంచి జనతా పార్టీ నేతగా పేరు గడించిన గౌతు లచ్చన్న, పీఎస్పీ నేత తెన్నేటి విశ్వనాథం విశాఖపట్నం నుంచి ఓడిపోయారు. కాంగ్రెస్‌లో దిగ్గజాలుగా చెప్పే కాకాని వెంకటరత్నం ఉయ్యూరులో ఓడిపోయినవారే.

పార్లమెంట్ బరిలోనూ తప్పని పరాజయాలు

1952లో కృషికార్ లోక్ పార్టీ పక్షాన గుంటూరు నుంచి పోటీచేసిన ఆచార్య ఎన్జీ రంగా కాంగ్రెస్ అభ్యర్థి నరసింహన్ చేతిలో చిత్తయ్యారు. 1967 ఎన్నికలలో చిత్తూరులో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన ఎన్‌పీసీ నాయుడు చేతిలో ఓడారు. 1971లో కాంగ్రెస్ అభ్యర్థి బి. రాజగోపాలరావు చేతిలోనూ రంగాకు పరాజయం తప్పలేదు. 1991లో గుంటూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన రంగా టీడీపీ అభ్యర్థి లాల్ జానా బాషా చేతిలో ఓడిపోయారు. మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1971లో అనంతపురం నుంచి ఎస్‌సీఓ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి పి.ఆంథోని రెడ్డి చేతిలో ఓడారు. మరో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి 1984లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థి కాటూరి నారాయణస్వామి చేతిలో ఓడిపోయారు. 1971 ప్రాంతాల్లో రాష్ట్రపతిగా పనిచేసిన వీవీ గిరి తాను ఆ పదవి అధిష్టించక పూర్వం అంటే 1957లో పార్వతీపురం నియోజకవర్గం నుంచి బి.సత్యనారాయణ చేతిలో పరాజయం చెందారు. మరో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి 1984లో టీడీపీ అభ్యర్థి ఇ.అయ్యపరెడ్డి, 1999లో కె.ఇ.కృష్ణమూర్తి చేతిలో ఓడిపోయారు. ఒంగోలు నుంచి 1977లో భారతీయ లోక్‌దళ్ (బీఎల్డీ) అభ్యర్థిగా పోటీచేసిన మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు కాంగ్రెస్ అభ్యర్థి పులి వెంకటరెడ్డి చేతిలో ఓడారు. తర్వాత 1989లో బాపట్లలో కాంగ్రెస్ అభ్యర్థి సలగల బెంజిమెన్ చేతిలో ఓడిపోయారు. లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన జిఎంసి బాలయోగి(టిడిపి) కూడా తాను ఆ పదవి చేపట్టక పూర్వం 1996లో కాంగ్రెస్ అభ్యర్థి కెఎస్ఆర్ మూర్తి చేతిలో పరాజితులయ్యారు. ప్రముఖ నాయకుడు తెన్నేటి విశ్వనాథం విశాఖపట్నం నుంచి 1971లో పీవీజీ రాజు చేతిలో పరాజితులయ్యారు. తర్వాత 1977లో ద్రోణంరాజు సత్యనారాయణరావు చేతిలో ఓడిపోయారు. తెన్నేటి విశ్వనాథం 1971లో ఇండిపెండెంట్‌గా, 1977లో బీఎల్డీ అభ్యర్థిగా పోటీచేశారు. 1977లో బీఎల్డీ అభ్యర్థిగా, 1980లో జనతా(ఎస్) అభ్యర్థిగా శ్రీకాకుళం నుంచి పోటీచేసిన గౌతు లచ్చన్న కాంగ్రెస్ అభ్యర్థి బి. రాజగోపాలరావు చేతిలో పరాజయం పాలయ్యారు.

బరిలో అన్నదమ్ములు

- కడపజిల్లాలో సీఎం జగన్, అవినాశ్
- పెద్దిరెడ్డి, బొత్స, అంబటి, ఆదిమూలపు సోదరులు
- విజయవాడ లోక్‌సభకు కేశినేని బ్రదర్స్ ఢీ



ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల బరిలో అన్నదమ్ములు పోటీకి దిగారు. వారిలో వైసీపీ నుంచి అత్యధికంగా పోటీ చేస్తున్నారు. ఇప్పటికే తండ్రుల కుమారులు, కుమార్తెలు వారసత్వ రాజకీయాలను అందిపుచ్చుకున్నారు. భర్తలను పక్కనపెట్టి మరికొందరు భార్యలు రంగ ప్రవేశం చేశారు. వారితోపాటు సార్వత్రిక ఎన్నికల్లో అన్నదమ్ములు పోటీచేస్తున్నారు. విజయవాడ లోక్‌సభ పరిధిలో మాత్రం వైసీపీలో ఒకరు, ఎన్డీఏ కూటమి తరపున టీడీపీ నుంచి మరొకరు ఉండి పోటీకి దిగడం రసవత్తరంగా మారింది. పోటీ చేస్తున్న కొందరి అన్నదమ్ముల అభ్యర్థుల వివరాలిలా ఉన్నాయి.

వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ కడపజిల్లా పులివెందుల అసెంబ్లీ నుంచి పోటీకి దిగారు. ఆయన సోదరుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి కడప ఎంపీ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో పులివెందులలో జగన్ భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇప్పటికే రెండుసార్లు ఇదే నియోజకవర్గం నుంచి ఆయన గెలుపొంది, హ్యాట్రిక్ కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మారిన రాజకీయ పరిస్థితులలో కడప లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ విడత జగన్ సోదరి వైఎస్ షర్మిల పోటీ చేయడంతో, అక్కడి పోటీ రసవత్తరంగా మారింది.

ప్రకాశంజిల్లా కొండెపి(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేశ్ పోటీ చేస్తున్నారు. ఆయన సోదరుడు ఆదిమూలపు సతీశ్ కర్నూలుజిల్లా కోడుమూరు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరుజిల్లా పుంగనూరు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి చిత్తూరుజిల్లా తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అదే పార్టీ తరపున బరిలో ఉన్నారు. రాష్ట్రమంత్రి అంబటి రాంబాబు సోదరులు వైసీపీ తరపున అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అంబటి రాంబాబు పోటీలోకి దిగారు. ఆయన సోదరుడు అంబటి మురళీకృష్ణ గుంటూరుజిల్లా పొన్నూరు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా ఉన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వైసీపీ తరపున ధర్మాన సోదరులు మళ్లీ పోటీకి సిద్ధమయ్యారు. శ్రీకాకుళం అసెంబ్లీ నుంచి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట అసెంబ్లీ నుంచి ధర్మాన కృష్ణదాస్ వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

ఉమ్మడి విజయనగరంజిల్లా చీపురుపల్లి వైసీపీ అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణ మళ్లీ పోటీ చేస్తున్నారు. గజపతినగరం అసెంబ్లీ నుంచి ఆయన సోదరుడు బొత్స అప్పల నర్సయ్య వైసీపీ తరపున బరిలో నిలిచారు. ఎన్టీఆర్‌జిల్లా విజయవాడ లోక్‌సభలో వైసీపీ, టీడీపీ నుంచి అన్నదమ్ముల సవాల్ నెలకొంది. వైసీపీ నుంచి ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) పోటీ చేస్తున్నారు. ఆయన సోదరుడు కేశినేని చిన్ని టీడీపీ నుంచి అన్నపై సై అంటున్నారు. ఇప్పటికే విజయవాడ ఎంపీ గా కేశినేని నాని రెండు సార్లు గెలిచారు. ఆయన వైసీపీలో చేరి మూడో సారి పోటీ చేస్తున్నారు.

\- విశాలాంధ్ర బ్యూరో-అమరావతి

కమ్యూనిస్టుల సేవలు
మరువగలమా!

జనం మాట

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన 15 ఎన్నికలలో ఐదు సార్లు సీపీఐ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మరో ఐదుసార్లు సమీప ప్రత్యర్థిగా నిలిచారు. 1953 నుంచి 2019 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులుగా తమ్మిన పోతరాజు 1953 లో, 62లో రెండు పర్యాయాలు, ఉప్పలపాటి రామచంద్ర రాజు 1985లో, కాకర్లపూడి సుబ్బరాజు 1994లో, షేక్ నాజర్‌వలీ 2004లో సీపీఐ అభ్యర్థులుగా విజయం సాధించారు. విజయవాడ నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు కమ్యూనిస్టు పార్టీ చేసిన సేవలను, కృషిని నగర ప్రజలు మరువలేరు. నగరంలోని కొండ ప్రాంతనివాసిత ఇళ్లకు బి ఫారం పట్టాలను ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతులు మీదుగా చిట్టినగర్ బహిరంగ సభ వేదికపై ఇప్పించి, అందుకు గుర్తుగా పైలాన్ కట్టించి పేదలకు సీపీఐ నాయకులు అండగా నిలిచారు. విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పడిన తర్వాత ప్రథమ మేయర్ టి వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ అయితా రాములు, లంకా గోవిందరాజులు 1981 నుంచి 1986 వరకు మొదటి ఐదు సంవత్సరాలలోనే పేద వర్గాలకు, సామాన్య ప్రజలకు, చిరు వ్యాపారులకు అండగా పరిపాలన సాగించి విజయవాడ ప్రజల హృదయాలలో కమ్యూనిస్టుల పరిపాలన సుస్థిర స్థానాన్ని ఏర్పర్చారు.

కనకదుర్గ గుడి ఏరియా, భీమనవారి పేట, లంబాడి పేట, అలీనగర్, టేనర్ పేట, సొరంగ ప్రాంతం, బ్రహ్మంగారి మఠం, జోడు బొమ్మలు సెంటర్, ఫ్రైజర్ పేట, గొల్లపాలెం గట్టు, వాగు సెంటర్ వడ్డెరలు, శ్రీనివాస్ మహల్ కొండ ప్రాంతం, బ్రాహ్మణ వీధి, మల్లికార్జున పేట, గాంధీ హిల్, వించిపేట ప్రాంతాలలో పారిశుద్ధ్య సమస్యలు, దోమల నివారణ చర్యలుపై కౌన్సిల్లో తీర్మానం చేసి, ప్రత్యేక శ్రద్ధతో కృషి చేశారు. కొండ శివారు ప్రాంతం వరకు మెట్ల నిర్మాణం, (కొండ క్రింద ప్రాంతం వారికి) నివసించే ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు పైపులైన్లు వేసి, వాటర్ ట్యాంక్ నిర్మాణాలు చేపట్టారు. వీధిలైట్లు, సైడు కాలువలు కట్టించి అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం నగరంలోని 64 డివిజన్‌లలో కొండ ప్రాంతాలు 16 డివిజన్‌లకు పశ్చిమ నియోజకవర్గంలో 10 డివిజన్‌లు ఉన్నాయి. 6 సెంట్రల్‌లో ఉన్నాయి. కొండలపై నివసించే ప్రజలంతా రోజువారి కూలీలు, షాపు గుమస్తాలు, భవన నిర్మాణ కార్మికులు. అత్యధికంగా పేదవర్గాలు జీవనం సాగిస్తున్నారు. వీరి సమస్యల పరిష్కారం కోసం, ఇతర ప్రయోజనాల కోసం కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులు చేసిన కృషి ఫలితంగా ఉత్తమ కార్పొరేటర్ పురస్కారాన్ని అందుకున్నవారున్నారు. నగర నివాస ప్రాంతాలలో, వివిధ కాలనీలలో ప్రధాన రోడ్లు నిర్మాణం కొరకు స్థానిక మహిళలను సంఘాలు ఏర్పాటు చేసి భాగస్వాములను చేశారు.

ముంపు ప్రాంతాలపై కృషి

బుడమేరుకట్ట, దేవీనగర్, ప్రస్తుతం వారధి పరిసర ప్రాంతం, రాణిగారి తోట, చలసాని నగర్ ప్రాంత నివాసితులకు ముంపు సమస్య నుంచి శాశ్వత పరిష్కారానికి కమ్యూనిస్టులు చేసిన కృషి మరువలేనిది. కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులంతా తమ పదవీకాలంలో అవినీతి మరక లేకుండా, ప్రభుత్వ, అధికారులతో రాజీ పడకుండా నగరాభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై చర్చించి, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలతో ఏకాభిప్రాయ తీర్మానాలు చేసి, ఉమ్మడి నిర్ణయాలను శక్తి వంచన లేకుండా అమలు చేశారు. అభివృద్ధికి దిక్సూచిగా నిలిచారు. కేంద్రంలో మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలకు ముప్పు వాటిల్లింది. రాష్ట్రంలో జగన్ పాలనలో అమరావతిలో ప్రజలకు, రాజధానికి తీరని అన్యాయం చేశారు. సార్వత్రిక ఎన్నికల సందడి ప్రారంభమై మరికొద్ది రోజులలో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో సీపీఐ, సీపీఎం కాంగ్రెస్ పార్టీలు కలిసి ఇండియా కూటమిగా ఏర్పడి పోటీచేస్తున్నాయి.

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి జీ కోటేశ్వరరావు కంకి కొడవలి గుర్తు పైన, సెంట్రల్ నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపైన, తూర్పు నియోజకవర్గంలో, ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థులకు హస్తం గుర్తు పైన ఓట్లు వేసి అఖండ విజయాన్ని చేకూరిస్తే నగరం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. సమ సమాజమే లక్ష్యంగా కమ్యూనిస్టులు చేసే కృషి, పరిపాలన వ్యవస్థలను కాపాడుతుంది. చైతన్యంతో ప్రజలని పరిపాలనలో భాగస్వాములను చేసి సమాజాభివృద్ధికి, మానవాభివృద్ధికి, దేశాభివృద్ధికి దోహదం చేస్తారు. కాబట్టి రాజ్యాంగాన్ని కాపాడాలంటే, దేశాన్ని రక్షించి, అభివృద్ధి చేయాలంటే ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న తరుణంలో అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

సువర్ణగంటి రాఘవరావు
హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు

CPI సీపీఐ అభ్యర్థులు

కమలాపురం
గాలి చంద్ర

కడప జిల్లా కమలాపురం శాసనసభా నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర కమలాపురం మండలం పొడదుర్తి గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి ఇంటర్మీడియట్, డిగ్రీ కమలాపురంలో చేశారు. కడప వైవీయూలో పీజీ జర్నలిజం చేశారు. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగివుండేవారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి గా పనిచేసి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారు. ప్రస్తుతం ఆయన సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. గాలి చంద్ర తల్లి తండ్రీ ఇద్దరు కూడా సర్పంచ్, ఎంపీటీసీలుగా పని చేశారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు.